www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

సంపుటి:02 సంచిక:64 ఆదివారం, 24.12. 2023



## ముగిసిన రాష్ట్రపతి శీతాకాల విడిది

- హకీంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీ బయలుదేరిన ద్రౌపది ముర్ము
- వీడ్కోలు పలికిన గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్‌రెడ్డి

2 లో

# నేడు కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం మీటింగ్



- పాలనా విధానంపై అధికారులకు దిశానిర్దేశం
- హాజరవనున్న డిప్యూటీ సీఎం, మంత్రులు
- టీపీసీసీ మీటింగ్స్ వాయిదా

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**
కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదివారం సెక్రటేరియట్‌లో తొలిసారిగా సమావేశం కానున్నారు. గత ప్రభుత్వ లోపాలను అరికట్టడంతో పాటు తమ ప్రభుత్వం ప్రకటించిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు, పాలనా యంత్రాంగాన్ని గ్రామ స్థాయికి తీసుకొని పోయే 'ప్రజా పాలన' కార్యక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేయనున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాముఖ్యతనిస్తున్న రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో ప్రతీ మంగళ, శుక్ర వారాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రజావాణిని జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో మరింత పకడ్బందీగా నిర్వహించడానికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికను ఈ కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించనున్నారు. అలాగే ఆర్థిక సాధికారిత కల్పించడం ద్వారా సామాజిక న్యాయం కల్పించేందుకై ప్రకటించిన ఆరు హామీల అమలుపై కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నారు. నిరుపేదలు, అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ ఫలాలు దక్కేలా పాలనా యంత్రాంగాన్ని గ్రామస్థాయిలో తీసుకెళ్లేందుకై ప్రభుత్వ పనితీరును మరింత మెరుగు పర్చడం, జవాబుదారిగా ఉండేందుకు ఈ ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ సమావేశానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లను కూడా ఆహ్వానించారు. డిసెంబర్ 28వ తేదీ నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు (సెలవు రోజులు మినహాయించి మొత్తం 8 పనిదినాలు) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటలవరకు ఈ ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహిస్తారు.
అన్ని గ్రామ పంచాయితీలు, మున్సిపల్ వార్డులల్లో రోజుకు రెండు గంటల చొప్పున

..మిగతా 2 లో



# పీవీ సంస్కరణలు ఆచరణీయం

## దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప మేధావి పీవీ

- పీవీ, జైపాల్‌రెడ్డి తెలంగాణకు లంకె బిందెల్లాంటి వారు
- దేశం కోసం పీవీ తీసుకున్న ప్రతి నిర్ణయం సాహసోపేతమే
- మాజీ ప్రధానికి నివాళి అర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**
దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సంస్కరణలు ఆచరణీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం పీవీ వర్ధంతి సందర్భంగా 'జ్ఞాన భూమి' వద్ద సీఎం, మంత్రులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప మేధావి పీవీ అని కొనియాడారు. పరిపాలనలో సమూల మార్పులు తెచ్చి ఆదర్శంగా నిలిచిన వ్యక్తి అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రశ్నార్థకంగా మారినప్పుడు సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారన్నారు. బంగారాన్ని కుదవ పెట్టి అప్పులు తేవడంపై ఆయన ఒకే మాట చెప్పారని.. 'తెలివైన వాడు సగం ఆస్తిని కుదవపెట్టి అయినా సరే మిగతా ఆస్తిని కాపాడుకుంటాడు' అని ఆయన చెప్పారని గుర్తుచేశారు. భూమిని పేదవాడికి అందుబాటులోకి తీసుకొచ్చిన వ్యక్తి పీవీ అన్నారు. పేదలకు భూములు పంచడానికి పీవీ బలమైన పునాదులు వేశారని తెలిపారు. పీవీ మన మధ్య లేకపోయినా వారి

..మిగతా 2 లో

# వైకుంఠ ఏకాదశి వైభవం





- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తుల భారీ క్యూలు
- గోవింద నామస్మరణతో మార్మోగిన వైష్ణవాలయాలు
- యాదాద్రి, భద్రాద్రి, వేములవాడలో వైభవంగా వేడుకలు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా రాష్ట్రంలో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉత్తర ద్వారం నుంచి విష్ణుమూర్తిని దర్శించుకునేందుకు తెల్లవారుఝామునుంచి భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. గోవింద నామస్మరణలతో ఆలయాల పరిసరాలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌టెంపుల్‌లో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదాద్రిలో లక్ష్మీనారసింహుడు మహావిష్ణువు అవతారంలో దర్శన మిచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులతో నర్సింహ్మాస్వామిని దర్శించుకున్నారు. భద్రాచలంలోనూ వైకుంఠశోభతో ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. సిరిసిల్ల జిల్లా వేముల వాడ రాజన్న గుడికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేసి స్వామివారి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. – స్టేట్ బ్యూరో, విశాల భారతి





## హైదరాబాద్‌లో మరో కరోనా కేసు

నీలోఫర్ లో ఆరు నెలల చిన్నారికి కరోనా

2 లో

## కొత్త రేషన్‌కార్డుల జారీ అవాస్తవం

- సోషల్‌మీడియాలో పుకార్లు ప్రజలు నమ్మొద్దు
- 28 నుంచి పంపిణీ చేస్తామని ఎక్కడా చెప్పలేదు..
- ఖండించిన సివిల్‌సప్లై శాఖ ఉన్నతాధికారులు



2 లో

## నేడు బీఆర్ఎస్'స్వేద పత్రం' రిలీజ్

### పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్న కేటీఆర్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**
తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్ శనివారం విడుదల చేయనున్న 'స్వేద పత్రం' కార్యక్రమం ఆదివారానికి వాయిదా పడింది. శనివారం ఉదయం11 గంటలకు విడుదల చేయాలని బీఆర్ఎస్‌వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ భావించినా.. వివిధ కారణాల రీత్యా నేటికి వాయిదా వేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆర్థిక, ఇంధన రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రాలు విడుదల చేసిన తరుణంలో ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి అందుకు పోటీగా స్వేదపత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించింది. తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్ కార్య నిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ ఇందుకు సంబంధించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. స్వయం పాలన ప్రారంభమైన తొమ్మిదిన్నరేళ్ల అనతి కాలంలోనే కేసీఆర్ ప్రభుత్వ దార్శనికతతో, యావత్ తెలంగాణ ప్రజలు చెమటోడ్చి సృష్టించిన సంపదపై స్వేదపత్రం విడుదల చేయనున్నట్లు

..మిగతా 2 లో



లోక్‌సభ ఘటనలో

## మెయిన్ రోల్ మనోరంజన్‌దే!

- కేంద్ర ప్రభుత్వానికి పెద్ద సందేశమివ్వాలనే ఉద్దేశంతో కుట్ర
- నిందితులను ఒప్పించడంలోనూ మనోరంజన్ కీ రోల్
- లలిత్ ఝా దర్యాప్తులో విషయం వెల్లడి

2 లో

## హైకోర్టు బిల్డింగ్స్ అద్భుతంగా నిర్మిస్తాం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి రాజేంద్రనగర్‌లో స్థల పరిశీలన
- మోడ్రన్‌టెక్నాలజీ, అన్ని హంగులతో నిర్మిస్తామన్న మంత్రులు
- జనవరిలో బిల్డింగ్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేస్తారని వెల్లడి



2 లో

# ముగిసిన రాష్ట్రపతి శీతాకాల విడిది

- హకీంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీ
- బయలుదేరిన ద్రౌపది ముర్ము
- వీడ్కోలు పలికిన గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్‌రెడ్డి

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం శీతాకాల విడిది ముగియడంతో హైదరాబాద్ నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. హకీంపేట విమానాశ్రయంలో ముర్ము కు తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ప్రభుత్వ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. శీతాకాలం విడిది కోసం రాష్ట్రపతి ఈ నెల 18 నుంచి నేటి వరకు హైదరాబాద్ బొల్లారంలో ఉన్నారు. ఐదు రోజుల పాటు రాష్ట్రంలో ఉన్న ద్రౌపది ముర్ము పర్యటనలో భాగంగా పోచంపల్లిని సందర్శించారు. థీమ్ పెవిలియన్ పార్కులో చీరల తయారీ యూనిట్‌కు వెళ్లి అక్కడ కార్మికులు మగ్గాలపై నేస్తున్న చీరలను ఆసక్తిగా పరిశీలించారు. నేత కార్మికులతోనూ ముచ్చటించారు. ఆనవాయితీలో భాగంగా బొల్లారంలోని తన నివాసంలో రాష్ట్రపతి శుక్రవారం తేనీటి విందు(ఎట్ హోం)ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గవర్నర్, సీఎంతో పాటు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఇతర ప్రముఖులు హాజరయ్యారు.



# పీవీ సంస్కరణలు ఆచరణీయం





మొదటిపేజీ తరువాయి
సంస్కరణలు సదా ఆచరణీయమని చెప్పుకొచ్చారు. పీవీ ఘాట్, జైపాల్ రెడ్డి ఘాట్‌లను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వీరిద్దరూ తెలంగాణకు లంకె బిందెల్లాంటి వారన్నారు. పీవీ కీర్తిని పెంచేలా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**పలువురు ప్రముఖుల నివాళి**

దేశవ్యాప్తంగా మాజీ ప్రధాని పీవీ నర్సింహ్మారావుకు పలువురు రాజకీయ నేతలు నివాళులర్పిస్తున్నారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పీవీ జ్ఞాన భూమి వద్ద ఆయన ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. నిష్ణాతుడైన పండితుడు, రాజనీతిజ్ఞుడు, పరిపాలనాదక్షుడు, తెలంగాణ గడ్డ మీద పుట్టిన గొప్ప బిడ్డ అని పీవీని కొనియాడారు గవర్నర్. ఢిల్లీ పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. అక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన పీవీ వర్ధంతి కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన ఫొటోకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ , తదితరులు పాల్గొన్నారు. భారత ఆర్థిక సంస్కరణల పితామహుడిగా పీవీని అభివర్ణిస్తూ.. దేశానికి ఆయన అందించిన సేవల్ని గుర్తు చేసుకుంటూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ ఉంచింది.



# హైకోర్టు బిల్డింగ్స్ అద్భుతంగా నిర్మిస్తాం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- మంత్రిశ్రీధర్‌బాబుతో కలిసి రాజేంద్రనగర్‌లో స్థల పరిశీలన
- మోడ్రన్‌టెక్నాలజీ, అన్ని హంగులతో నిర్మిస్తామన్న మంత్రులు
- జనవరిలో బిల్డింగ్‌నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేస్తారని వెల్లడి

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**
తెలంగాణ హైకోర్టు కొత్త బిల్డింగ్‌నిర్మాణానికి కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నట్లు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం రాజేంద్రనగర్ మండలంలోని బుద్వేల్‌సమీపంలో హైకోర్టు బిల్డింగ్స్‌నిర్మాణాలకు కేటాయించిన 100 ఎకరాల స్థలాన్ని ఐటీ అండ్‌ఇండస్ట్రియల్‌మినిస్టర్‌దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హైకోర్టు జడ్జిలు జస్టిస్ అభినంద్ కుమార్ శావిలి, జస్టిస్ టి. వినోద్ కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ విజయసేనా రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ఇది ప్రజలకు తీరని ఇబ్బందులు కలిగించిందని ఆయన ఆక్షేపించారు. అందుకే ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు అందాల్సిన న్యాయ సౌకర్యాల కల్పనలో ఎక్కడా రాజీపడకుండా అద్భుతంగా హైకోర్టును నిర్మిస్తామని ఆయన తెలిపారు. జనవరిలో సీఎం శంకుస్థాపన చేయనున్న ఈ బిల్డింగ్‌నిర్మాణం కక్షిదారులకు, జడ్జిలు, లాయర్ల అవసరాలకు సరిపడేలా, సకల సౌకర్యాలతో, ఆధునిక పద్ధతుల్లో ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయతీరాజ్ కార్యదర్శి ఎం రఘునందన్ రావు, న్యాయశాఖ కార్యదర్శి రేండ్ల తిరుపతి, రంగారెడ్డి కలెక్టర్ భారతీ హోళీకేరితో పాటు ఇతర హైకోర్టు జడ్జిలు పాల్గొన్నారు.

# నేడు కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం మీటింగ్

మొదటిపేజీ తరువాయి
అధికారులతో కూడిన బృందాలు పర్యటిస్తాయి. ఈ ప్రజాపాలన కార్యక్రమానికి స్థానిక సర్పంచ్, కార్పొరేటర్, కౌన్సిలర్‌లను ఆహ్వానించడంతో పాటు సంబంధిత ప్రజా ప్రతినిధులందరూ విధిగా పాల్గొనేలా చర్యలు తీసుకుంటారు. ఈ గ్రామ సభల్లో వచ్చిన ప్రతీ దరఖాస్తును ప్రత్యేకంగా పరిశీలించడానికి ఒక్కోదానికి ఒక్కొక్క ప్రత్యేకమైన నెంబర్ ఇవ్వడంతోపాటు వాటిని కంప్యూటరైజ్ చేస్తారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొంటారు.

**టీపీసీసీ సమావేశాలు వాయిదా**

రేపు గాంధీ భవన్‌లో జరగాల్సిన టీపీసీసీ కార్యవర్గ సమావేశాలు వాయిదా పడ్డాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్ల సమావేశాలు ఉన్న నేపథ్యంలో ఈ సమావేశాలు వాయిదా వేస్తున్నామని చెప్పారు. జనవరి మొదటి వారంలో టీపీసీసీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# లోక్‌సభ ఘటనలో మెయిన్ రోల్ మనోరంజన్‌దే!

- కేంద్ర ప్రభుత్వానికి పెద్ద సందేశమివ్వాలనే ఉద్దేశంతో కుట్ర
- నిందితులను ఒప్పించడంలోనూ మనోరంజన్ కీ రోల్
- లలిత్ ఝూ దర్యాప్తులో విషయం వెల్లడి

**విశాల భారతి, నేషనల్ బ్యూరో:**
పార్లమెంట్‌పై దాడి ఘటనలో ప్రధాన నిందితుడిగా కర్ణాటకకు చెందిన మనోరంజన్ను పోలీసులు అనుమానిస్తున్నారు. అందుకు సంబంధించిన కొన్ని కీలక ఆధారాలు కూడా లభ్యమైనట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వానికి పెద్ద సందేశం పంపించాలనే ఉద్దేశంతో ఈ కుట్ర పన్నినట్లు పోలీసులు భావిస్తున్నారు.
పార్లమెంట్లో అలజడి ఘటనలో ప్రధాన కుట్రదారు డి.మనోరంజనేనని ఢిల్లీ ప్రత్యేక విభాగం పోలీసులు అనుమానిస్తున్నారు. దీనికి సంబంధించి కొన్ని ఆధారాలు కూడా లభించినట్లు తెలుస్తోంది. ఏదైనా ఒక సంచలనాత్మక ఘటన ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పెద్ద సందేశం పంపించాలనే ఉద్దేశంతోనే లోక్‌సభలో అలజడికి నిందితులు ఈ కుట్ర పన్ని ఉంటారని భావిస్తున్నారు. పన్నాగం అమలుకు నిందితులను ఒప్పించడంలోనూ మనోరంజన్ కీలకంగా వ్యవహరించాడని తెలుస్తోంది. పోలీసులు అరెస్టు చేసిన ఆరుగురు నిందితుల్లో ఒకడైన లలిత్ ఝూ దర్యాప్తులో ఈ విషయాన్ని వెల్లడించినట్లు సమాచారం. పార్లమెంట్ ఘటన తర్వాత ఆధారాలను చెరిపివేసే బాధ్యతను మాత్రమే తనకు అప్పగించారని లలిత్ విచారణ సమయంలో పేర్కొన్నాడని తెలుస్తోంది.
ఈ నెల 13న పార్లమెంటు లోపల దాడికి ప్రయత్నించి సాగర్ శర్మతో పాటు మనోరంజన్ భద్రతా సిబ్బందికి పట్టుబడ్డారు. ఇక సంవత్సరం క్రితం తాము మైసూరు వెళ్లేందుకు టికెట్లను సమకూర్చింది కూడా మనోరంజనేనని లలిత్ ఝూ తెలిపాడు. నిందితులు అందరికీ శుక్రవారం మానసిక విశ్లేషణ పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. నిరుద్యోగ సమస్య, రైతుల ఉద్యమం, మణిపుర్ సంక్షోభం వంటివి తమను తీవ్ర నిరాశకు గురిచేశాయని నిందితులు చెప్పినట్లు తెలిపారు. అయితే, పార్లమెంటుపై దాడి ఘటనకు సంబంధించి సహేతుకమైన కారణాలను ఇంకా తెలుసుకోవాల్సి ఉందని అధికారులు వెల్లడించారు. శుక్రవారం లలిత్ ఝూను కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు లలిత్ను 14 రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగించింది. నిందితులకు ఆశ్రయమిచ్చిన విశాల్ కూడా పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు.

**ఎఫ్ఐఆర్ ప్రతిని ఇవ్వాలన్న ఉత్తర్వుల నిలిపివేత**

లోక్సభలో అలజడి సృష్టించిన నిందితులకు సబంధించిన ఎఫ్ఐఆర్ ప్రతిని అందజేయాలంటూ ఢిల్లీ పోలీసులకు ట్రయల్ కోర్టు జారీ చేసిన ఆదేశాలను ఢిల్లీ హైకోర్టు నిలిపివేసింది. దిగువ కోర్టు ఉత్తర్వులను పోలీసులు ఢిల్లీ హైకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్ను జస్టిస్ స్వర్ణకాంతశర్మ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. నిందితురాలు నీలం దేవికి నోటీసు జారీ చేయడం సహా ట్రయల్ కోర్టు ఆదేశాలపై స్టే విధించింది. తదుపరి విచారణ జనవరి 4వ తేదీకి వాయిదా పడింది. అయితే అత్యంత సున్నితమైన ఈ కేసులో ఎఫ్ఐఆర్ ప్రతి కోసం నిందితులు పోలీస్ కమిషనర్‌ను సంప్రదించాల్సిందని, కానీ నేరుగా ట్రయల్ కోర్టును ఆశ్రయించారని పోలీసులు వాదించారు. ప్రధాన నిందితులు మనోరంజన్, సాగర్‌శర్మ, అమోల్ ధన్‌రాజ్ శిందే, నీలం దేవిలకు విధించిన కస్టడీని ట్రయల్ కోర్టు జనవరి 5వ తేదీ వరకు గురువారం పొడిగించింది.



# ఎమ్మెల్యేల కొనుగోలులో దర్యాప్తు సాగుతోంది

- త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తాం
- సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి



**విశాలభారతి,హైదరాబాద్:**
ఎమ్మెల్యేల కొనుగోలుకు సంబంధించిన కేసులో విచారణ కొనసాగుతోందని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. త్వరలోనే ఈ కేసుపై అన్ని వివరాలు అందిస్తామని వెల్లడించారు. శనివారం సైబరాబాద్ కు సంబంధించి వార్షిక నేర నివేదికను విడుదల చేశారు. కమిషనరేట్ పరిధిలో గతేడాదితో పోలిస్తే ఈసారి సైబర్ క్రైమ్ కేసులు పెరిగాయని చెప్పారు. అలాగే, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ (Srinivas Goud)పై హత్యాయత్నం కేసులో సైతం దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

**పెరిగిన సైబర్ నేరాలు**

సైబరాబాద్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు మరింత పకడ్బందీగా పని చేస్తామని సీపీ పేర్కొన్నారు. ఆర్థిక, స్థిరాస్తి నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయని, బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కమిషనరేట్ సిబ్బంది 2 నెలలు సమర్థంగా పని చేశారని అన్నారు. 'గతేడాది సైబర్ క్రైమ్ కేసులు 4,850 ఉంటే, ఈసారి 5,342 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది రూ.232 కోట్ల మోసం జరిగింది. 2023లో 277 డ్రగ్స్ కేసులు నమోదు కాగా, 567 మందిని అరెస్ట్ చేశాం. రూ.27.82 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేశాం.' అని పేర్కొన్నారు. 2023లో రెండు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేశామని సీపీ మహంతి పేర్కొన్నారు. ఈ ఏడాది మహిళలపై నేరాలు తగ్గాయన్నారు. 2022లో 316 అత్యాచారం కేసులు నమోదైతే, ఈసారి 259 కేసులు నమోదయ్యాయని చెప్పారు. గతేడాది పోలిస్తే మోసాల కేసులు పెరిగాయని, 2022లో 6,276 కేసులు రాగా, ఈ ఏడాది 6,777 కేసులు నమోదయ్యాయని తెలిపారు. సైబరాబాద్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు, హత్యలు, దోపిడీ, చోరీ కేసులు కూడా పెరిగాయని వెల్లడించారు. 2022లో 93 హత్య కేసులు వస్తే ప్రస్తుతం 105 హత్య కేసులు నమోదైనట్లు ప్రకటించారు. ఈ ఏడాది 52,124 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైతే, వాటిలో 1,271 మందికి శిక్షలు పడ్డాయని చెప్పారు.

# కొత్త రేషన్‌కార్డుల జారీ అవాస్తవం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**
రాష్టంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను ఈ నెల 28 నుంచి ఇచ్చేందుకు కసరత్తు మొదలు పెట్టిందని వస్తున్న వార్తలపై పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు క్లారిటీ ఇచ్చారు. సోషల్ మీడియాలో, ఇతర ప్రచార మాధ్యమాల్లో రేషన్‌కార్డుల జారీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అంశాన్ని అధికారులు ఖండించారు. అసలు ఎందుకు ఇలా చేస్తున్నారో.. ఎవరు ఇలా చేస్తున్నారో తమకు తెలియడంలేదని తల బాదుకుంటున్నారు. తమకు ఉదయం నుంచి కార్యాలయానికి వందల ఫోన్‌లు వస్తున్నాయని అధికారులు వాపోయారు. ఉన్నతాధికారులుగా తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని స్పష్టం చేశారు.
ఈ నెల 12న పౌర సరఫరా శాఖమంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశంలో కుడా కొత్త రేషన్ కార్డుల పంపిణీ, పెండింగ్ రేషన్ కార్డులపై నిర్ణయం ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, దీనిపై సీఎం రేవంత్ రెడ్డితో అలాగే మంత్రి వర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని అధికారులు కుడా ధ్రువీకరించారు. తమకు మంత్రి నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని వెల్లడించారు. ప్రభుత్వం నుంచి ఏమైనా అధికారిక సమాచారం వస్తే తామే చెబుతామని, తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. వాట్సాప్ లేదా ఇతర మాధ్యమాలలో వచ్చిన వాటికీ తాము ఏమి సమాధానం చెప్పలేమని అధికారులు తెలిపారు. ఇటువంటి పుకార్లను ప్రజలు నమ్మద్దని వెల్లడించారు.

# నేడు బీఆర్‌ఎస్ 'స్వేద పత్రం' రిలీజ్

మొదటి పేజీ తరువాయి
బీఆర్‌ఎస్ పేర్కొంది. తొమ్మిదిన్నరేళ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానం దేశ చరిత్రలోనే ఓ సువర్ణ అధ్యాయం అని తెలిపింది. పగలూ, రాత్రి తేడా లేకుండా రెక్కల కష్టంతో చెమటోడ్చి నిర్మించిన తెలంగాణ ప్రతిష్ఠను దెబ్బతీస్తే సహించబోమని కేటీఆర్ పేర్కొన్నారు. విఫల రాష్ట్రంగా చూపించాలని ప్రయత్నిస్తే భరించబోమన్న ఆయన అగ్రగామి రాష్ట్రాన్ని అవమానిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోబోమని స్పష్టం చేశారు. అందుకే గణాంకాలతో సహా వాస్తవ తెలంగాణ ముఖచిత్రాన్ని వివరించేందుకు అప్పులు కాదు, తెలంగాణ రాష్ట్రానికి సృష్టించిన సంపదను ఆవిష్కరించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆయా వర్గాలకు ఒనగూరిన లబ్ధి, సృష్టించిన ఆస్తుల వివరాలు, విలువను స్వేదపత్రం ద్వారా వెల్లడించనున్నారు. ఇదే సమయంలో కేసీఆర్ ప్రభుత్వ హయంలో తీసుకొచ్చిన మార్పు వ్యవసాయం సహా వివిధ రంగాలకు సంబంధించి ప్రజల్లో అభద్రతను పోగొట్టి కల్పించిన స్థైర్యం, తద్వారా ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పులను ఇందులో వివరించనున్నారు. రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల ఇబ్బందులపై కార్మిక విభాగం ఆధ్వర్యంలో కమిటీ : రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్‌ఎస్ పార్టీ కమిటీ ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు పలు ఆందోళన కార్యక్రమాలు చేపడుతూ తమ స్థితిగతులపైన ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో పార్టీ అధ్యక్షులు కేసీఆర్ ఆదేశాల మేరకు కమిటీ వేసినట్లు వివరించారు.



# గిగ్ అండ్ ప్లాట్ ఫార్మ్ వర్కర్లతో సీఎం మీటింగ్

- రాజస్థాన్‌తరహా గిగ్‌ప్లాట్‌ఫార్మ్‌బిల్లు తేవాలన్న వర్కర్లు
- 'మహాలక్ష్మి'తో ఉపాధి కోల్పోయామని ఆవేదన

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** నాంపల్లిలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో గిగ్ వర్కర్స్‌తో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి సీఎం రేవంత్ చీఫ్ గెస్ట్‌గా హాజరయ్యారు. ఎన్నికల ముందు గిగ్ అండ్ ప్లాట్ ఫార్మ్ వర్కర్లకు న్యాయం చేస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు శనివారం ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్విగ్గీ, జొమాటో, ఆటో డ్రైవర్లు, గిగ్ ప్లాట్ ఫార్మ్ కిందకు వచ్చే ఓలా, ఊబర్, ర్యాపిడో, పోర్టర్, స్విగ్గి, జోమాటో తదితర కంపెనీలో పనిచేస్తున్న వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి చర్చించనున్నారు.
అయితే మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యాలు కల్పించటం వల్ల ఉపాధి కోల్పోయి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో గిగ్ వర్కర్లు సీఎం రేవంత్‌కు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 20 వేల గిగ్ వర్కర్లు ఉండగా.. తమకి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఎంను కోరినట్లు సమాచారం. రాజస్థాన్ తరహా గిగ్ ప్లాట్ ఫార్మ్ కార్మికుల సంక్షేమ బిల్లు తేవాలని వర్కర్లు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాగా ఈ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీలను ప్రకటించిన సంగతి తెలిసిందే.దీంతో తెలంగాణ సీఎం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రేవంత్ రెడ్డి మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తెచ్చారు. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. ఈ పథకం ద్వారా ఆటో డ్రైవర్లు, ఉబర్, ఓలా సిబ్బంది ఉపాధి కోల్పోయారు. దీంతో వారంత మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాలంటూ ఆందోళనలు చేపట్టి బస్ భవన్ ముట్టడికి యత్నించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో వారి పరిస్థితిని అర్థం చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి నేడు సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో వారి సమస్యలు విన్న సీఎం ఆటో, ఊబర్, ర్యాపిడో, ఓలా వర్కర్ల కోసం ఎటువంటి నిర్ణయం తీసుకుంటారు, ఎలాంటి భరోసా కల్పించనున్నారనేది ప్రాధాన్యతను సంతరించుకుంది.

# హైదరాబాద్‌లో మరో కరోనా కేసు

**విశాలభారతి,హైదరాబాద్:** హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రిలో మరో కరోనా కేసు నమోదైంది. ఆరు నెలల చిన్నారికి కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో నీలోఫర్‌లో నమోదైన కరోనా కేసుల సంఖ్య మూడుకు పెరిగింది. అయితే, పిల్లల ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి తెలిపారు. ఇదిలా ఉండగా.. ఇటీవల 14 నెలల చిన్నారికి కరోనా సోకిన విషయం తెలిసిందే. ఆగాపుర ప్రాంతానికి చెందిన చిన్నారికి వైరస్ సోకింది. చిన్నారి 45 రోజుల కింద తీవ్ర జ్వరం, ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతుండగా తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకువచ్చారు. అనుమానం వచ్చి కరోనా టెస్టులు చేయగా.. వైరస్ పాజిటివ్‌గా తేలింది. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. గడిచిన 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 12 పాజిటివ్ కేసులు రికార్డయినట్లు ఆరోగ్యశాఖ తెలిపింది

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

GENERAL NEWS
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily



# బీఆర్ఎస్ అవినీతిపై విచారణ చేస్తాం

**టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి**



**సూర్యాపేట, విశాలభారతి:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాజీ మంత్రి గుంట కండ్ల జగదీశ్ రెడ్డి హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేటలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.లక్షల కోట్లు అప్పులు చేసి తెలంగాణ అద్భుతమని గ్లోబల్ ప్రచారం తో మోసం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ఆదాయంలో 34 శాతం అప్పులకు, 35% జీతభత్యాల కే పోతుందని వివరించారు.అధికారంలోకి వచ్చిన ఆరు రోజులకే ఆరు గ్యారెంటీలు ఏమైనాయని కేటీఆర్ ప్రశ్నించడం తగదు అన్నారు.పదేళ్ళకు ముందు 33 రోజులకు సరిపోయిన మిగులు నిధులు ఉంటే నేడు మూడు రోజులకు సరిపోయే నిధులు కూడా లేవని, దీనికి కారణం గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలన అని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ప్రజలు అర్థం చేసుకోవాలని, రాష్ట్రంలో ఉద్యోగులకు కాంట్రాక్టర్లకు 40,000 కోట్లు చెల్లించాల్సి ఉందని వెల్లడించారు.అయినప్పటికి ఆరు గ్యారెంటీలపై ఏమాత్రం తగ్గేది లేదని ,7 లక్షల కోట్ల అప్పులు ఉన్న ఆరు గ్యారంటీగా కచ్చితంగా అమలు చేస్తాము అని స్పష్టం చేశారు. ప్రజావాణికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందని , ప్రతిరోజు 20వేల దరఖాస్తులు వస్తున్నాయి అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్య, వైద్యంలో విధ్వంసం జరిగిందని, జాతీయంగా సగటున ఏడు శాతం విద్యకు ఐదు శాతం వైద్యానికి ఖర్చు చేయాల్సి ఉన్న తెలంగాణలో గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఆ విధంగా చేయలేదన్నారు.అప్పులు తెచ్చిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమై దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. బీ ఆర్ఎస్ హయాంలోగ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు వేల కోట్లలో దోపిడీ జరిగిందన్నారు. జిల్లాలో తొమ్మిదిన్నర ఏళ్లలో జరిగిన అన్ని అవకతవతలపై విచారణ చేపిస్తామని , బాధ్యులైన నాయకులు, అధికారులపై చర్యలు తీసుకుంటాము అని అన్నారు.



## ఘనంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు

**శాలిగౌరారం, విశాలభారతి:** ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శాలిగౌరారం లోని శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయం లో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం లో దేవత మూర్తులను గరుడ వాహన పై ప్రతిష్టించి గ్రామ పుర వీదుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. మహిళా భజన తో స్వామి వారి ఊరేగింపు కన్నుల పండుగ గా జరిగింది.ఈ కార్యక్రమం లో ఆలయ ధర్మ కర్తలు శేషం నర్సింహా చార్యులు, శేషం జగన్ మోహన చార్యులు శ్రీమన్నారాయణ మాల దరులు,ఎం. పి టి సి జోగు సైదమ్మ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ చార్టర్ ప్రసిడెంట్ బుడిగె శ్రీనివాస్‌నాగమణి, గ్రామ పురోహితులు రామడుగు వెంకట్రామ శర్మ, సింగల్ విండో వైస్ ఛైర్మెన్ చామల మహేందర్ రెడ్డి, నాయకులు చామల వెంకటరమణా రెడ్డి, సురేందర్ రెడ్డి, దీకొండ నరేందర్ ,వాడపెల్లి జగన్ తదితరులు పాల్గొన్నారు.

## 'కృష్ణ శబ్ధం' గీతం పై సరయు నృత్య ప్రదర్శన



**చిట్యాల, విశాలభారతి:** చిట్యాల పట్టణం ఠాగూర్ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న పెద్ది సరయు శనివారం హైదరాబాదులోని శ్రీ త్యాగరాజ గాన సభ ఆడిటోరియంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చింది. సికింద్రాబాద్ లోని శ్రీ శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమీ దశమ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా సినీ గీతాలాపన సంగీతం నృత్య ప్రదర్శనలు జరిగాయి.అకాడమీ డైరెక్టర్ చిల్లా శివపార్వతి నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో 'కృష్ణ శబ్ధం' గీతం పై కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించింది.చక్కని అభినయనాన్ని ప్రదర్శించిన సరయు ను వీక్షకులు అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, ప్రముఖ సినీ నేపథ్య గాయని గాయత్రి నారాయణ జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ వెంకట్ రెడ్డి, అకాడమీ ఇన్చార్జులు డి మేఘన, శాంతి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**వరినాట్లు వేసిన విద్యార్థులు**

చిట్యాల, విశాలభారతి: చిట్యాల పట్టణంలో ఉన్న గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో విద్యార్థులు మాజీ ప్రధానమంత్రి వ్యవసాయ మార్పుల కోసం ఉద్యమం చేపట్టిన చౌదరి చరణ్ సింగ్ జన్మదినం సందర్భంగా జాతీయ రైతు దినోత్సవాన్ని, అలాగే సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు స్వయంగా వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి రైతు పడుతున్న కష్టాలను నష్టాలను అడిగి తెలుసుకున్నారు అంతే కాకుండా విద్యార్థులు వరి నారు వేసి అలరించారు. విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి రైతు వెన్నుముక లాంటివాడని రైతు లేకపోతే దేశానికి ఆహారం ఉండదని ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే రైతుల యొక్క కష్ట నష్టాలు తెలుసుకొని వాళ్లకు ఏ విధంగా సహాయం సాకారాలు అందించాలో విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థినీ విద్యార్థులు వివిధ వేషాధారనల్లో క్రీస్తు జన్మదిన వృత్తంతాన్ని తెలియజేస్తూ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బండి వీణా అనిల్ కుమార్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి, ఏఓ పోల గోవర్ధన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## దుస్తుల పంపిణీలో పాల్గొన్న చావ శిరామకృష్ణ

**పాలేరు, విశాల భారతి:** తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన క్రిస్టమస్ విందు మరియు దుస్తుల పంపిణీనీ పాలేరు లో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు పాలేరు నియోజకవర్గ నాయకులు చావా శివరామకృష్ణ పాల్గొన్నారు.



## వల్మిడి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

**పాలకుర్తి, విశాల భారతి:** మండలంలోని వల్మిడి గ్రామంలో శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ సీతా రామచంద్రస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ఝాన్సీ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వారికి ఆశీర్వచనం అందించారు. అనంతరం గూడూరు గ్రామంలో డా.చుక్కా రామయ్య ఫౌండేషన్ గూడూర్ & మహాత్మ హెల్పింగ్ హాండ్స్ వారి సౌజన్యంతో నిర్వహించిన 10వ తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్స్ పంపిణీ కార్యక్రమంలో ఝాన్సీ రెడ్డి పాల్గొని విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బైరి భార్గవ్, గంటా రవీందర్, గూడూరు మాజీ సర్పంచ్ మాచర్ల పుల్లయ్య, సర్పంచ్ మంద కొమురయ్య, హెచ్ఎం, టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్

**ఐటీడీ ప్రాజెక్ట్ అధికారి ప్రతీక్ జైన్**

**భద్రాచలం, విశాల భారతి:** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా లోని 60 ఆశ్రమ పాఠశాలలు ,వసతి గృహాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు ఈ గ్రేడ్ సాధించిన పిల్లలను దృష్టిలో పెట్టుకొని అత్యుత్తమ ర్యాంకులతో పాస్ అయ్యే విధంగా ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్ రూపొందించడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం నాడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులచే రూపొందించిన సబ్జెక్టు టెక్స్ బుక్కులను తన చాంబర్లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పదవ తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకొని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో, వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీసి పదవ తరగతిలో అత్యుత్తమ ర్యాంకులతో పాస్ అయ్యే విధంగా ఈ సబ్జెక్టు బుక్కులను రూపొందించడం జరిగిందని ఆయన అన్నారు. హెచ్ఎంలు ,వార్డెన్లు ,తమ పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థిని ,విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఈ సబ్జెక్టు బుక్కులను చదివే విధంగా కృషి చేయాలని, ఏమాత్రం అశ్రద్ధ చేసిన సంబంధిత ఉపాధ్యాయులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ముఖ్యంగా ఈ గ్రేడ్ సాధించిన విద్యార్థిని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.



## అద్దె కోసమే ఆర్భాటంగా టీ హబ్ ప్రారంభం

**మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గం ఇంఛార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి**

**సూర్యాపేట, విశాలభారతి :** లేని కంపెనీల పేరుతో హడావుడిగా ప్రారంభం చేసి నిరుద్యోగ యువతను మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంఛార్జ్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని టి హబ్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీ హబ్ పాత కలెక్టర్ కార్యాలయం నుండి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ భవనంలోకి ఎందుకు మార్చారని ప్రశ్నించారు. ఆ భవనంలో వసతులు లేనప్పుడు ఎందుకు ప్రారంభించారని, ప్రభుత్వం మారితే కిరాయి రాదనే ఉద్దేశ్యంతో ముందుగానే మార్చారా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా టి హబ్ లో శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడుతూ నిరుద్యోగ యువత నైపుణ్యాన్ని పెంచుకొని ఉద్యోగం సాధించాలని అన్నారు. శాశ్వత ఐటి హబ్ బిల్డింగ్ మంజూరు చేయాలని ఐటి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ని కలిసి విన్నవిస్తానని చెప్పారు. సూర్యాపేట నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కావలసిన ప్రణాళికలను ప్రభుత్వంతో మాట్లాడి మంజూరు చేపిస్తానని అన్నారు.




## భక్తి శ్రద్ధలతో వైకుంఠ ఏకాదశ

**కల్వకుర్తి, విశాలభారతి:** వైకుంఠ ఏకాదశి వేడుకలు శనివారం అమనగల్లు పట్టణ కేంద్రంలోని వెంకటగిరి శ్రీ శ్రీ పద్మావతీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ప్రత్యేక పూజలు, భజనలు, భగవన్నామస్మరణలతో ఆలయం మార్మోగింది. ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు అర్చకులు విభిన్న రూపాల్లో ప్రత్యేక అలంకరణలు చేశారు. వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యములో తెల్లవారుజాము నుంచే వైకుంఠద్వారము ఆరాధన, శ్రీ గోదారంగనాథ స్వామి విశేష దర్శనము, తులసీదళ అర్చన, ప్రబంధ విన్నపము, నివేదన, మంగళాశాసనము తదుపరి అర్చనలు, తీర్థ, ప్రసాద వినియోగము జరిగాయి. అకుతోటపల్లి సర్పంచ్ శ్రీపాతి రజిత శ్రీనివాస్ రెడ్డి, పాపిశెట్టి శ్వేత రాము, సునీత నిరంజన్ గౌడ్, వాణి కండె సాయి దంపతులు, అమనగల్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రమణారెడ్డి, వెటర్నరీ డాక్టర్ రుద్రాక్ష విజయ్ కుమార్, మహేష్(ఐడియా ),ఎర్రవోల్లు మహేష్, శ్రీను పూజలు నిర్వహించారు.



## బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- **గత ప్రభుత్వం బీసీలను నిర్లక్ష్యం చేసింది**
- **బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్**

**మిర్యాలగూడ, విశాలభారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం క్యాబినేట్, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానికంగా మాట్లాడారు. గత ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగానే పరిగణించి బీసీలను నిర్లక్ష్యం చేసిందన్నారు. బీసీలకు ప్రత్యేక సంక్షేమ పథకాల అమలు చేయడంతో పాటు వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు పోల గాని వెంకటేష్ గౌడ్,ఆర్లపూడి శ్రీనివాస్, నరసింహా, చిలకల మురళి, గంగాధర్, నరేష్ ఉన్నారు.



## నా నియోజకవర్గమే దేవాలయం

- **ప్రజా సమస్యలు తీర్చడమే లక్ష్యం**
- **కళ్యాణ్ లక్ష్మి, క్రిస్మస్ సామాగ్రి పంపిణీ**
- **ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రామచంద్రనాయక్.**

**మరిపెడ,విశాలభారతి:** నియోజకవర్గమే దేవాలయం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే నాబలం బలగమని ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రునాయక్ అన్నారు. శనివారం మరిపెడ మండల కేంద్రంలోని భార్గవ ఫంక్షన్ హాల్లో కల్యాణలక్ష్మి, క్రిస్మస్ సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళ్యాణ లక్ష్మి చెక్కులు 56, మరిపెడ ,చిన్న గూడూరు మండలాలకు చెందిన 360 మంది క్రైస్తవ సోదరులకు పండగ సామాగ్రి పంపిణీ చేశారు. డోర్నకల్ నియోజకవర్గం లోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకి అండగా ఉంటానన్నారు. కాంగ్రెస్ కార్యకర్తకి ఎటువంటి పరిస్థితుల్లో కూడా కష్టం రానీయననీ అన్నారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వంలో ఆగిపోయిన పనులను పూర్తి చేస్తానన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలుపడం జరిగింది. రానున్న ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ విజయం సాధిస్తారని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో మరిపెడ మండలం డిప్యూటీ తహసిల్దార్ వాంకుడోత్ రాజు, ఎంపీడీవో దన్ సింగ్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఆర్ఐ నంద, మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండ్లి రఘువీర్ రెడ్డి, యుగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వెంకన్నను దర్శించుకున్న ఖేడ్ ఎమ్మెల్యే దంపతులు

**నారాయణఖేడ్, విశాలభారతి:** నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అనుపమరెడ్డి దంపతులు వారి కుటుంబ సభ్యులతో కలిసి వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారిని వైకుంఠ ద్వారం ద్వారా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని, స్వామివారి దీవెనలతో రాష్ట్ర, నారాయణఖేడ్ నియోజకవర్గం ప్రజలు చల్లగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

## జాతీయ రహదారికి పీవీ నరసింహారావు పేరు నామకరణం

**పీవీ 19వ వర్ధంతి వేడుకలు**






**భీమదేవరపల్లి, విశాల భారతి:** ముఖ్యమంత్రి రేవంత్ తో మాట్లాడి నిర్మాణం జరుగుతున్న ఎల్కతుర్తి సిద్దిపేట జాతీయ రహదారికి మాజీ ప్రధాని పివి నరసింహారావు రోడ్డు అని నామకరణం చేసేలా ఒప్పిస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని మాజీ ప్రధాని పివి సరసింహరావు స్వగ్రామం వంగరలో శనివారం పివి 19వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొప్ప ఆశయాలతో జీవించిన పివి నరసింహారావు జీవిత చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నరసింహారావు పేరుతో జిల్లా ఏర్పాటు డిమాండ్ మేధావుల వాదనలపై చర్చలు జరుపుతామని పివీ జిల్లా సాధన సభ్యులతో అన్నారు. అనంతరం చాడా వెంకటరెడ్డి మాట్లాడుతూ గల్లీ నుండి ఢిల్లీ వరకు ఎదిగిన నాయకుడు పివి అని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డా సుధీర్ కుమార్, ఎంపీపీ జక్కుల అనితరమేష్, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఆలూరి రజిత, ఉప సర్పంచ్ రాజు, కౌసల్య, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ, హనుమకొండ అడిషనల్ కలెక్టర్ మహేందర్, ప్రొఫెసర్ వీరన్న నాయక్, కర్ణ కంటి మంజుల రెడ్డి, గజ్జల సురేష్ ,నరేందర్, చిట్కూరి అనిల్, పోగుల శ్రీకాంత్,జక్కుల అనీల్ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily




## మౌలిక వసతుల కల్పన కోసం మంత్రికి వినతిపత్రం

**భీమదేవరపల్లి, విశాలభారతి:** మండలంలోని దివంగత భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహరావు స్వగ్రామం వంగరలోని డా. పివి నర్సింహరావు బాలికల గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పన కోసం రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఏస్ఎంసి చైర్మన్ అనపురం రమేశ్, విద్యార్థినిలు వినతి పత్రాన్ని అందజేశారు. పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ మాట్లాడుతూ బాలికల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు 571మంది బాలికలు ఉన్నారని, వేసవి కాలం వస్తే తాగు నీటి సమస్యతో బాలికలు ఇబ్బంది పడుతున్నారు అని అన్నారు. విద్యార్థినిలకు సరిపడా బాతు రూములు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. అంతకు ముందు గురుకులంలో దివంగత మాజీ భారత ప్రధాని పీవీ నర్సింహారావు19 వ వర్ధంతి సందర్భంగా విద్యార్థినులు భారత మాజీ ప్రధాని పీవీ గురించి ఉపన్యాసం , చిత్ర పటానికిన పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గురుకుల ఏటిపి సారిక,సిబ్బంది భార్గవి, అముక్త, సుభాష్, మహేష్, మాధవి,రవి,పిఈటి నిర్మల,టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది విద్యార్థినులు ఉన్నారు.

## సుంకిరెడ్డికి ఎమ్మెల్సీ ఇవ్వాలని చర్చ

**కల్వకుర్తిలో పార్టీ బలోపేతం చేసిన వారికే పట్టం పట్టాలనే భావన**



**కల్వకుర్తి, విశాల భారతి:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని రాఘవేందర్ రెడ్డి అభిమానులు, గ్రామాల్లో ప్రజలు కోరుతున్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ కోసం తిరిగి జీవం పోసి కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఎమ్మెల్సీ పదవికి అర్హుడని ప్రజలు చర్చించుకుంటున్నారు. తన ఐక్యత ఫౌండేషన్ పేరుతో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అలాంటి వారికి పదవి ఉంటే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉందని అంటున్నారు.



## ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలు

**భీమదేవరపల్లి, విశాల భారతి:** ముల్కనూర్ ది లీడ్ ఎస్ ఆర్ కె పాఠశాలలో సెమీ క్రిస్టమస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి కేకును కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పిల్లలు ఆలపించిన నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆదిరెడ్డి మాట్లాడుతూ, కులమత బేధాలు లేకుండా ఇలాంటి వేడుకలను జరుపుకోవాలని అన్నారు. అన్ని మతాల సారాంశం "దేవుడు ఒక్కడేనని" వివిధ మతాలవారు దేవుణ్ణి ఒక్కొక్క రూపంలో పవిత్రంగా భావిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కవిత, కృష్ణ, ఉమామహేశ్వరి, శిరీష, సంధ్యారాణి, పద్మ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆశదీప్ రెడ్డి సాయం

**కల్వకుర్తి, విశాల భారతి:** కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కాయితి ఆశాదీప్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. గురువారం అర్ధరాత్రి మార్చాల సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కల్వకుర్తి వాసి నవాజ్ కుటుంబానికి ఆశదీప్ రెడ్డి తన వంతు సహకారం అందించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఆయన తక్షణసాయంగా రూ. 5వేలు ఆర్థిక సాయంతో పాటు 50 కేజీల బియ్యం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు సోఫీ, అబ్దుల్, విక్కీ, బ్లాక్ కాంగ్రెస్ ఎస్సి విభాగం అధ్యక్షులు శేఖర్, ఎస్టీ సెల్ దాస్య నాయక్, కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం ఉపాధ్యక్షులు సైదుల్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రఫీ బాయ్, దేవేందర్ నాయక్, మైనారిటీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



## త్వరలోనే కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలి

**భీమదేవరపల్లి,విశాలభారతి:** మండలంలోని మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మంచాల రమాదేవిని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి వంగర గ్రామంలోని తమ నివాసంలో పరామర్శించారు. ఇటీవలే రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్ర గాయం అవడంతో ఆమెను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. త్వరలోనే కోలుకొని ప్రజాక్షేత్రంలో రావాలని ఆకాంక్షించారు. వీరితో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, తదితరులు ఉన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తుంది

**ప్రజా సమస్యలపై పోరాటమే సిపిఎం లక్ష్యం**



**చిట్యాల, విశాలభారతి:** బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. చిట్యాల పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీతారాములు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం పార్లమెంటు లో 143 మంది ఎంపీలను సస్పెండ్ చేసి నిరంకుశత్వానికి ఉపయోగపడే 3 కీలక బిల్లులను ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ఆమోదింప చేసుకోవడం దుర్మార్గమన్నారు. ఆమోదించిన బిల్లులు 100ఏళ్ల పైవరకు దేశ ప్రజలకు దేశానికి ఉపయోగపడుతుందని బిజెపి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పార్లమెంటులోకి ముష్కరులు ప్రవేశిస్తే ప్రధానమంత్రి హోం మంత్రి ఖండించి కఠిన చర్యలు తీసుకోకపోవడం వారి నిరంకుశత్వానికి నిదర్శనమని ముష్కరులకు అనుమతి పాసులు ఇచ్చిన ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సరిగ్గా 22 సంవత్సరాల క్రితం 2001 డిసెంబర్ 13న దాడి జరిగిందని, ఇప్పుడు కూడా అదే రోజు దాడి చేయడం పట్ల ప్రభుత్వ వైఫల్యాలను బయటపెట్టిందన్నారు. భారత రాజ్యాంగాన్ని తుంగలోకి తొక్కి మనుధర్మ శాస్త్రాన్ని ప్రజాస్వామ్యంలో విస్తరింపజేయాలని చూస్తున్న బిజెపిని ఓడించి దేశ ప్రజాస్వామ్యాన్ని కి రక్షణ కల్పించుకునే అవసరం ఉందన్నారు. రానున్న రోజుల్లో ప్రజలను చైతన్య పరచడానికి కార్యాచరణ చేపట్టామని ప్రజా సమస్యలపై పోరాటమే సీపీఎం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అవిశెట్టి శంకరయ్య, జెల్లల పెంటయ్య, మండల నాయకులు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పొలం బాటలో విద్యార్థులు

**రైతు దినోత్సవంలో భాగంగా క్షేత్ర పర్యటన**

**భీమదేవరపల్లి, విశాల భారతి:** జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా శనివారం ది లీడ్ ఎస్ ఆర్ కే విద్యార్థులు పొలం బాట పట్టారు. తరగతి గదుల్లో పుస్తకాల పఠనంతో పాటు వ్యవసాయ క్షేత్రాల్లో రైతుల పనితీరు కూడా నేటి విద్యార్థులకు అవగాహన కోసం క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కాశిరెడ్డి ఆదిరెడ్డి తెలిపారు. 90% వ్యవసాయంపై ఆధారపడి జీవించే కుటుంబాల పిల్లలే తమ పాఠశాలకు వస్తున్నారని, వారికి కనీస అవగాహన ఉండేందుకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవీఎస్, ఎల్లా అధ్యాపకులు సంధ్యారాణి, శిరీషతోపాటు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రత్యేక ఎస్టి కమిషన్ ఏర్పాటు చేయాలి.

- విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయంగా ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి.
- తెలంగాణ షెడ్యూల్ తెగల సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో ఎస్టీ ప్రతినిధులు..

**ముషీరాబాద్,విశాల భారతి:** రాష్ట్రంలో ఎస్టీలకు విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయంగా అభివృద్ధి చెందడానికి 12 శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని తెలంగాణ షెడ్యూల్ తెగల సంక్షేమ సంఘం కోరింది. ఎస్టీలం మేమంతా ఒకటే జనాభా దామాచ ప్రకారం వాటా ఇవ్వాలని పేర్కొంది. ఈ మేరకు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మింట్ కాంపౌండ్ లో రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రూప్ సింగ్,లోకిని రాజు హాజరై ఆదివాసి గిరిజన తెగలలో ఉన్నటువంటి సమస్యలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు విద్య ఉద్యోగ రంగాల్లో అమలు చేసింది, కానీ కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్టిలకు విద్య ఉద్యోగ ఉపాధి సంక్షేమం రాజకీయ రంగాల్లో 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. మైదాన ప్రాంతాల్లో నివసించే ఆదివాసి గిరిజనులకు 47% బడ్జెట్ కేటాయించి ప్రత్యేక ఐటిడిఏ ఏర్పాటు చేసి దాని ద్వారా అభివృద్ధి చెందేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అలానే ఏజెన్సీ ప్రాంతంలో నివసించే ఆదివాసుల కోసం జీవో నెంబర్ 3 ని యధావిధిగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఎస్టీ కమిషన్ తో పాటు రాష్ట్రంలో ట్రైబల్ కౌన్సిల్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ రాష్ట్ర స్థాయి సమావేశంలో తెలంగాణ షెడ్యూల్ తెగల సంక్షేమ సంఘం ప్రతినిధులు సంజీవ్, వనం రమేష్, గణేష్ నాయక్, నక్కల ప్రకాష్, రామకృష్ణ, సాయి, మత్తయ్య, వనం అశోక్, మద్దెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## దేవుని ఎర్రవల్లి గ్రామంలో బోనాలు

**చేవెళ్ల, విశాల భారతి:** చేవెళ్ల మండల పరిధిలోని దేవుని ఎర్రవల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, ఈదమ్మ ఆలయ ప్రారంభోత్సవాల సందర్భంగా గ్రామ దేవతలవిగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా ప్రాంభమయ్యాయి. ఈసందర్భంగా శనివారం గ్రామస్తులు మహిళలతో బోనాలు నిర్వహించి భారీ ఎత్తున ఆలయాలకు వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కామ మాణిక్య రెడ్డి, వాసన మౌనిక రెడ్డి ,ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు బేగరి అరుణ్ కుమార్ , కరిక శ్రీనివాస్ ,మాజీ సర్పంచ్ శ్యామలయ్య, జంగయ్య గౌడ్, మల్లేష్, విఠల్ రెడ్డి, పతి సత్యనారాయణ, శ్రీనివాస్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు



**కూకట్ పల్లి,విశాలభారతి:** మహేష్ ముదిరాజ్ స్వామి జన్మదిన వేడుకలు స్నేహితుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు పాపిరెడ్డి నగర్ కంటెస్టెండ్ అధ్యక్షుడు చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి మహేష్ ని కలిసి శాలువాతో సత్కరించి, పులబుకే అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో, అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆ భగవంతున్ని వేడుకున్నారు.



## పాఠశాలలో సెమి క్రిస్మస్

**కోదాడ, విశాల భారతి:** కోదాడ పట్టణంలోని న్యూ విజన్ పాఠశాలలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రిస్మస్ దుస్తులు ధరించి ఏసు క్రీస్తు జననంపై నిర్వహించిన నాటికలు, నృత్యాలు, పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా న్యూ విజన్ పాఠశాల డైరెక్టర్ కార్తీక్ రాజా మాట్లాడుతూ క్రీస్తు చూపిన బోధనలు క్షమాగుణం, శాంతి, కరుణ, సహనం, ప్రేమ, సదా అనుసరణీయమని వారు చూపిన బాటలో ప్రతి ఒక్కరు జీవించాలన్నారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.



## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన


**సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యంగా చేయాలి**

**కోదాడ, విశాలభారతి:** కోదాడ కోర్టు ఆవరణలో జిల్లా కలెక్టరేట్ నుండి మంజూరైన సుమారు పది లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల జడ్జి శ్యాంసుందర్, జూనియర్ సివిల్ అడిషనల్ జడ్జ్ భవ్య శ్రీ లు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసి రోడ్డు నిర్మాణ పనులను గుత్తేదారులు నాణ్యంగా పూర్తి చేయాలన్నారు. కోదాడ కోర్టుల అభివృద్ధికి నిధులు మంజూరు కావడం హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు దేవ బత్తిని నాగార్జున, ఉపాధ్యక్షులు గాలి శ్రీనివాస్ నాయుడు, ప్రధాన కార్యదర్శి సాధువు శరత్ బాబు, కోశాధికారి పాషా, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, బార్ అసోసియేషన్ సభ్యులు సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు

**చిట్యాల, విశాలభారతి:** చిట్యాల మండలం నేరడ గ్రామంలో శ్రీ ఆండాళ్ శ్రీ ఆల్వార్ల సహిత శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవములు వైభవంగా కన్నుల పండుగ నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీరంగం పాండురంగ ఆచార్యులు ఆచార్య తత్వంలో ప్రత్యేక పూజలతో స్వామి వార్ల ఉత్తర ద్వార దర్శనం భగవన్నామ సంకీర్తనలతో మహిళలు మంగళారతులతో ఆలయ ప్రదక్షణ గావించి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ధనుర్మాస మాసంలో భాగంగా ఏడవ రోజు తిరుప్పావై ద్రావిడ ప్రబంధ పారాయణం సామూహికంగా నిర్వహించడం జరిగింది. గీతా జయంతి సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ పాపని జనార్ధన్ గీతా జయంతి విశేషములను తెలియపరుస్తూ భక్తులందరిచే శ్రీ కృష్ణాష్టమి స్తోత్రం పారాయణం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుబ్బాక శోభ వెంకటరెడ్డి,ఆలయ భక్తబృందం చైర్మన్ ముషం రామస్వామి ఉపాధ్యక్షులు గుర్రం బిక్షపతి ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి లక్ష్మయ్య సంయుక్త కార్యదర్శి కేబుల్ టీవీ శ్రీనివాస్ కోశాధ్యక్షులు ఆనందం కృష్ణయ్య సభ్యులు చెరిపెల్లి గోవర్ధన్ మిరియాల సత్యనారాయణ వడ్డేపల్లి అంజయ్య పులిపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.





## రాష్ట్ర చెస్ జట్టు కోచ్ గా కరుణాకర్ రెడ్డి

**జాతీయ చేస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు**

**నల్లగొండ, విశాలభారతి:** తమిళనాడు రాష్ట్రంలోని వెల్లూరు లో ఈ నెల 25నుండి 30వరకు జరిగే 67వ జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చెస్ పోటీలకు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి, చిట్యాల జిల్లా పరిషత్ గెజిటెడ్ ప్రదానోపాధ్యాయులు కొసనం కరుణాకర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర జట్టు కోచ్ గా ఎంపికయ్యారు. 14,17,19 వయసు విభాగాల్లో బాల బాలికలకు జరిగే ఈ పోటీలలో తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున 15 మంది బాలురు 15 మంది బాలికలు పాల్గొంటారు. ఈనెల 18 నుండి 20 వరకు మంచిర్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల నుండి తెలంగాణ జట్లను ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు కన్వీనర్ గా వ్యవహరించిన కరుణాకర్ రెడ్డిని రాష్ట్ర జట్టు కోచ్గా ఎస్ జి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె రామ్ రెడ్డి, మంచిర్యాల జిల్లా కార్యదర్శి పరిమళ కుమారి ఎంపిక చేశారు. కాగా ఉమ్మడి నల్గొండ జిల్లా(సూర్యాపేట జిల్లా) నుండి అండర్ 19 విభాగంలో దివ్య భవాని, అండర్ 14విభాగంలో రమ్య ఈ జాతీయ పోటీలకు ఎంపికయ్యారని కరుణాకర్ రెడ్డి తెలిపారు.

## నేటి సెమిక్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలి



**నారాయణఖేడ్, విశాల భారతి:** ఖేడ్ సాయిబాబా ఫంక్షన్హాల్లో ఆదివారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రభుత్వం తరపున నియోజకవర్గంలోని అన్ని చర్చిల ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్రాండ్ సెమిక్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని ఖేడ్ హెబ్రోనుచర్చి సభ్యులు అమృత్, సాయిలు, ప్రశాంత్, పీటర్, అంజయ్య, సంజీవ్, ఏసుదాస్ కోరారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు సురేష్ శెట్కార్ తదితరులు పాల్గొని క్రిస్మసిఫ్ట్పంపిణితో పాటు విందులో పాల్గొంటారని వివరించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily




## ఘనంగా గీతా జయంతి

**నారాయణఖేడ్, విశాల భారతి:**నారాయణఖేడ్ పట్టణంలోని షిరిడి సాయిబాబా ఆలయం గీతా జయంతి పురస్కరించుకొని సాయిబాబా అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ మలమంచి మోహన్ జోషి వైదికనిర్వహణలో సామూహిక గీతా పారాయణం మరియు గీతా యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదములు సంగ్రహించడం జరిగింది.

# రైతులకు రుణాలు ఇవ్వాలి



**తుర్కయంజాల్, విశాలభారతి:**రైతులకు ప్రభుత్వం హక్కు పత్రాలు కల్పించిన భూములకు రాష్ట్రంలోని సహకార బ్యాంకులన్నీ రుణాలు ఇవ్వాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ నూతన చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ప్రభుత్వం హక్కులు కల్పించిన భూములపై గత 13 సంవత్సరాలుగా రుణాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు హక్కు పత్రాలు పంపిణీ చేశరన్నారు. ఆ భూములపై జాతీయ బ్యాంకులు ఋణాలు ఇస్తున్నాయని, కానీ సహకార బ్యాంకులు ఎలాంటి రుణాలు ఇవ్వడం లేదని, దీనిపై తగు చర్యలు తీసుకొని నిరుపేద రైతు కుటుంబాలకు సహాయ పడాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సిమోర్చా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బచ్చిగళ్ళ రమేష్,మరియు బిజెపి నాయకులు పలుస శ్రావణ్ కుమార్ గౌడ్, తూళ్ళ నర్సింహ గౌడ్, మాధు శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## క్రిస్మస్ కానుకలను అందజేత

**కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి**

**మేడిపల్లి,విశాలభారతి:** మత సామరస్యాలకు ప్రతీకగా తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న క్రిస్మస్ కానుకలను మున్సిపల్ కార్యాలయంలో నగర పరిధిలోని క్రైస్తవ సంఘాల పాస్టర్లకు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు, రంజాన్‌కు ముస్లింలకు, బతుకమ్మ పండుగకు హిందువులకు కొత్త బట్టలు అందించామన్నారు. అందరూ కొత్త బట్టలతో పండుగ జరుపుకోవాలని ఈ కానులను అందజేసినట్లు తెలిపారు.ప్రజలు సంతోషంగా ఉండాలని, శాంతితో, రాగద్వేషాలు లేకుండా ప్రజలందరూ బాగుండాలి ఏసుక్రీస్తు బోధించాడన్నారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు మద్ది యుగేందర్ రెడ్డి,ఏంపల్ల అనంత రెడ్డి,దొంతిరి హరిశంకర్ రెడ్డి, , కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్ నాయకులు బండారి రవీందర్,బోడిగే కృష్ణ, జావీద్ ఖాన్,మేనేజర్ జ్యోతి, మేడిపల్లి మండల పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేక పూజా కార్యక్రమంలో నగేష్ షెట్కర్

**నారాయణఖేడ్, విశాల భారతి:**వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక పురాతన రామ మందిరం నారాయణఖేడ్ పట్టణంలో వైభవపేతంగా ఉత్తర ద్వారా పూజా కార్యక్రమం, ఉత్తర ద్వారం గుండా సీతారామచంద్ర లక్ష్మణ స్వాముల దర్శనము సీతారామచంద్ర స్వాముల వారికి విశేష అభిషేకము అధిక సంఖ్యలో భక్తులు అయ్యప్ప స్వాములు నగేష్ కుమార్ శెట్కర్ ప్రత్యేకమైన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ మలమంచి మోహన్ జోషి, రావి చెట్టు రాఘవేంద్రచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష అలంకరణ అభిషేకము విశేష హారతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**కల్వకుర్తి, విశాల భారతి:**కల్వకుర్తి పట్టణంలోని ఎస్ పి ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో శనివారం స్వపరిపాల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు.. రాజకీయ నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులుగా తమ తమ పాత్రల్లో ఒదిగిపోయారు. నిత్యం తరగతి గదిలో పాఠాలు వినే విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి సంబుర పడ్డారు. ముఖ్యమంత్రిగా రేహాన్, ఎమ్మెల్యేగా తిరుపతి, విద్యాశాఖ మంత్రిగా కీర్తన, జిల్లా కలెక్టర్ గా వైష్ణవి, జిల్లా విద్యాధికారిగా ప్రీతి, డిప్యూటీ విద్యాధికారిగా సింధు, మండల విద్యాధికారిగా స్నిగ్ధ, పాఠశాల ప్రిన్సిపాల్ గా శ్రావ్య లు తమ విధులను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ముగిసిన జంతుశాస్త్ర అంతర్జాతీయ సదస్సు

**పలు అంశాలపై ప్రజెంటేషన్**

**సికింద్రాబాద్,విశాలభారతి:** ఓయూ జంతుశాస్త్ర విభాగం శత జయంతి ఉత్సవాల సందర్భంగా జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో " రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జువాలజీ ఇన్నోవేషన్స్ ఛాలెంజస్ అండ్ అపర్చునిటీస్ " అనే అంశాలపై సెమినార్ హాల్లో గత 3 రోజుల జాతీయ సదస్సు ఘనంగా ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన యచ్ సి యు లైఫ్ సైన్స్ మాజీ హెడ్ ప్రో. అనిత జగోటా అల్జీమర్ అండ్ పార్కిమ్ సన్ డిసిస్ జకల్ రిథమ్ పై ప్రసంగించారు. టీఎస్ అండ్ ఎపి రీజినల్ డెరైక్టర్ ఫర్ హెల్త్ డా.అనురాధ మేడోజు బయో సెక్యూరిటీ బయలాజికల్ వేపన్స్ లేజీ ఏషన్ అండ్ బయాజికల్ యాక్ట్ అనే అంశంపై ప్రసంగించారు.సిడిఎఫ్డి మాజీ డెరైక్టర్ డా.తంగారాజన్,ఓయూ రిజిస్ట్రార్ ప్రో.పి.లక్ష్మీ నారాయణ, యూజీసీ డీన్ ప్రో. జి.మల్లేశం, సైన్సు డీన్ ప్రో.కరుణ సాగర్ లు ప్రసంగించారు.జువాలజీ విభాగం హెడ్, ఆర్గనైజింగ్ సేకరేటరీ డా.ఎం.మాధవి, కో జాయింట్ ఆర్గనైజింగ్ సేకరేటరీ ప్రో.ఎవి. రాజా శేఖర్ లు మాట్లాడుతూ. ఈ అంతర్జాతీయ సెమినార్ లో 43 పోస్టర్ ప్రజంటేషన్స్ , 23 ఓవరల్ ప్రజెంటేషన్స్ చేసినట్లు చెప్పారు. పీహెచ్డీ,పీజీ విద్యార్థులు,సబ్జెక్ట్ నిపుణులు ఈ సదస్సులో 4 టెక్నికల్ షెషన్స్ గా విభజించి పరిశోధకులు వారి వారి పరిశోధన పత్రలు సమర్పించారు. విభాగం బిఓఎస్ అండ్ ఆర్గనైజింగ్ సేకరేటరీ సీనియర్ ప్రో.ఎస్.జితేందర్ నాయక్, ప్రిన్సిపాల్ ప్రో.వీరయ్య, ప్రో.శ్రీనివాసులు, ప్రో.పద్మజ, ప్రో.చిత్ర, ప్రో.ఎ. నాగేశ్వరరావు, విభాగం అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు



## వైకుంఠ ఏకాదశి వేల దేవాలయాల్లో పూజలు

**విశాలభారతి,సనత్ నగర్:**వైకుంఠ ఏకాదశి సందర్భంగా సనత్ నగర్ నియోజకవర్గంలోని పలు వైష్ణవ ఆలయాలలో ఉత్తర ద్వార దర్శనంను తెలంగాణ ప్రతి కాంగ్రెస్ కమిటీ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్ ఆర్ నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయం, బాపునగర్ లోని ఆలయం, 7 టెంపుల్స్ లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోటా నీలిమగారు మాట్లాడుతూ సనత్ నగర్ నియోజకవర్గంలో ప్రతి ఒక్క అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. పథకాల అమలులో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## ఏసుక్రీస్తు బోధనలు లోకానికి అనుసరణీయం

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**ఏసుక్రీస్తు బోధనలు లోకానికి అనుసరణీయం అని పెద్ద అంబర్పేట్ మున్సిపల్ చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి అన్నారు. పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు తట్టి అన్నారంలో బేతేస్త బాప్టిస్ట్ చర్చి మినిస్ట్రీస్ పాస్టర్ సుధాకర్, ఎస్తేరురాణి ఆధ్వర్యంలో స్థానిక కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి సహకారంతో క్రిస్మస్ వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ క్రిస్మస్ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి, వైస్ చైర్మన్ ఛామ సంపూర్ణ విజయ శేకర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రపంచానికి యేసుక్రీస్తు శాంతిదూత అని అన్నారు. సమాజ శాంతి స్థాపన కోసం జన్మించిన మహనీయుడు ఏసుక్రీస్తు అని కొనియాడారు. యేసుక్రీస్తు బోధనలు లోకానికి ఆచరణీయం అని అన్నారు. క్రిస్మస్ వేడుకలతో ప్రతి ఇంటా శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని అన్నారు. ఏసుక్రీస్తు మార్గం నీతిమంతమైన మార్గమని అన్నారు. ఏసుక్రీస్తు చూపిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని అన్నారు. మానవాళికి శాంతి, సమాధానం, ప్రేమను బోధించిన క్రీస్తు సూక్తులను కేవలం బోధనలకే పరిమితం చేయకుండా ఆచరణలో ఆ ప్రేమను అందరికీ పంచాలన్నారు. ఇతరులను ప్రేమించే తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారూ. అనంతరం తట్టి అన్నారం కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ...మత సామరస్యాలకు ప్రతీకగా పండుగలను విద్యార్థి దశ నుండే పిల్లలు అలవర్చుకోవడం చాలా మంచిదని అన్నారు. లౌకిక భారత దేశంలో ప్రతి జాతి, ప్రతి మతం యొక్క స్వేచ్ఛను కాంగ్రెస్ పార్టీ గౌరవిస్తుందన్నారు. మున్సిపాలిటీలోని క్రైస్తవ సోదరులంతా కుటుంబ సభ్యులతో ఆనందోత్సవాల మధ్య, స్వేచ్ఛాయుతంగా క్రిస్మస్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ వేడుకల్లో తాము భాగస్వాములు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. క్రైస్తవ సోదరులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తధంతరం కొంతమంది పాస్టర్స్‌కు కౌన్సిలర్ గీత వేణుగోపాల్ రెడ్డి సొంత ఖర్చులతో చైర్మన్, వైస్ చైర్మన్ చేతుల మీదుగా దుస్తువులను పంపిణీ చేశారు. అనంతరం క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు ఆడిపాడిన క్రిస్మస్ గీతాలు, సాంస్కృతిక నృత్యాలు, నాటికలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అంతకుముందు పాస్టర్ శ్యామ్ సుకుమార్ రాజ్ క్రైస్తవ సోదరులను ఉద్దేశించి వాక్యాన్ని బోధించారు. పాపాలు పోవుట కోసమే క్రీస్తు లోకానికి వచ్చాడని చెప్పారు. ఏసుక్రీస్తు మానవాళి పాప పరిహారర్థ బలి యాగం కోసం లోకానికి వచ్చాడని అన్నారు. ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తును ఆరాధించాలని కోరారు. అనంతరం కౌన్సిలర్ గీత వేణుగోపాల్ రెడ్డి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ను, తదితరులను శాలువాలతో సన్మానించారు. అనంతరం చర్చి పాస్టర్స్, సభ్యులు కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డిని అభినందిస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ క్రిస్మస్ వేడుకల్లో హయత్నగర్ సొసైటీ చైర్మన్ ఛామ కృష్ణారెడ్డి, పాస్టర్స్ సుధాకర్, ఎస్తేరురాణి, రామకృష్ణ, ప్రభాకర్, ప్రభావతి, వివిధ చర్చిల సంఘాల సభ్యులు, యూత్ సభ్యులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## పాస్టర్లకు క్రిస్మస్ కానుక

**కార్పొరేటర్లు,దొడ్ల వెంకటేష్ గౌడ్, సబియా గౌస్**

**కూకట్ పల్లి,విశాలభారతి:** క్రిస్మస్ పండుగ సందర్భంగా 124 డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ డివిజన్ పరిధిలో ఉన్న పాస్టర్లకు వారి చేతులమీదుగా నూతన వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ లోక రక్షకుడు.. కరుణామయుడు.. ఏసుక్రీస్తు పుట్టిన పవిత్రమైన రోజున జరుపుకునే క్రిస్మస్ పండుగ అందరూ ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ లోని ప్రజలందరూ కుల మతాలకు అతీతంగా అన్ని పండుగలు కలిసిమెలిసి చేసుకోవడం ఆనందించదగ్గ విషయమని, డివిజన్ లో ఉన్న క్రైస్తవ సోదర సోదరీమణులు అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అనిల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, పోశెట్టిగౌడ్, వాసుదేవరావు, పాస్టర్స్ ఎమ్. రాజు, ఎమ్.ఎమ్. సురేష్ కుమార్, ఎమ్. సత్య రాజు, ఎ. గోపి, ఎమ్ శ్యామ్ జాషువా, సి.ఎచ్ ఫిలిప్, నాగభూషణం, బిషోప్ శామ్యూల్, ఎమ్. దేవదాస్, ప్రేమ్ కుమార్, ఉమా జాషువా, జోషేప్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

**అల్లాపూర్ డివిజన్ పరిధిలో..**

కూకట్ పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కమ్యూనిటీ హాల్ లో శనివారం కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని డివిజన్ పరిధిలోని పలుచర్చి పాస్టర్ లను పిలిపించి వారి సమక్షంలో కేక్ కట్ చేసి సెమీ క్రిస్టమస్ వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆమె చేతుల మీదుగా నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. డివిజన్ పరిధిలోని అన్ని చర్చిల పాస్టర్లకు తన సొంత నిధులతో అందజేసి క్రిస్టియన్ మైనార్టీలకు పవిత్రమైన క్రిస్మస్ వేడుకలను అందరూ సుఖసంతోషాలతో ఘనంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ అసోసియేషన్ అధ్యక్షులు స్వామి పాస్టర్ గారు, మల్లికార్జున్, యోగి రాజు, లక్ష్మి, మరియు పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.





## స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం

**పల్లకిసేవ లో పాల్గొన్న భక్తులు**

కొందుర్గు,విశాలభారతి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం కొందుర్గు మండల పరిధిలోని గ్రామాల ఆలయాల్లో భక్తులకు స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. స్థానిక లక్ష్మినరసింహ స్వామీ దేవాలయంలో వేకువ జామునే స్వామి వారి అలంకరణ అనంతరం భక్తజనుల నడుమ కోలాహలంగా గ్రామంలో స్వామి వారి పల్లకి సేవ నిర్వహించి సమస్త భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణధికారి శ్రీనివాస శర్మ , ప్రధాన అర్చకులు భరత్ స్వామి,స్థానిక నేతలు కావలి యాదయ్య, జిబి క్రిష్ణ,బోయ శంకర్, చేవెళ్ల కృష్ణయ్య, ఈసరి సత్యం,కందుకముల కృష్ణయ్య,శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్ ఆలయ కమిటీ ప్రతినిధులు,ఆలయ సేవకులు,భజన భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం.

- విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారిన వేళ.
- మేయర్ జక్కా వెంకట్ రెడ్డి. కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి.

**మేడిపల్లి,విశాలభారతి:**పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ఘనంగా "స్వయం పరిపాలన దినోత్సవం" జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించే విధానాన్ని మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి హాజరై స్వయంగా వీక్షించారు.కలెక్టర్‌గా బి.రాజేశ్వరి, డీఈవోగా ఎం.మౌనిక, డిప్యూటీ డీఈవోగా చైతన్య , హెచ్ఎంగా పి. మణి, పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఒకరోజు బోధనలో ఎదురైన అనుభవాలు వాటిని ఏవిధముగా అధిగమించాలన్న విషయాలను విద్యార్థులే గురువులుగా మారి స్వయంగా తెలుసుకున్నారు. విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ నాణ్యమైన విద్యను అందించాలని గౌరవ ప్రధానోపాధ్యాయుడిగా వ్యవహరించిన పి. మణి కోరారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి చక్కటి బోధన చేశారని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు అగ్లంలో అనర్గళంగా మాట్లాడుతూ బోధనలు చేయడం సంతోషంగా ఉందన్నారు.నేటి బాలలే రేపటి పౌరులు విద్యార్థులు చిన్నతనం నుండి కష్టపడి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు అభినందనలు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పాఠశాలకు అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు



## బండి రమేష్ ను కలిసిన ఉప్పు రాము

**విశాలభారతి, కూకట్ పల్లి:**కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్‌ను తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర సీనియర్ నాయకుడు ఉప్పు రాము మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇన్చార్జిగా నియమితులై సందర్భంగా శాలువాతో అభినందలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో కొప్పిశెట్టి దినేష్, గంట శ్రీనివాస్ గౌడ్, తూము సంతోష్, గొట్టిముక్కుల వెంకట్, రాఘవేందర్,అనిల్,రామారావు,అచ్చిరెడ్డి, సత్యం, టైలర్ చిన్న, పూర్ణ, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మల్లారెడ్డి గూడ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు

**హాజరైన పామేన భీం భరత్**

**విశాలభారతి,షాబాద్:** షాబాద్ మండల కేంద్రంలోని మల్లారెడ్డి గూడ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పామేన భీం భరత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముద్దెంగుడ ఎంపిటిసి కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్,దండు రాహుల్ గుప్తా, మాధవ రెడ్డి,పెంట రెడ్డి, రవీందర్ నాయక్, సుభాష్ రెడ్డి, మధుకర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి ,వెంకటేష్‌గౌడ్, బాలరాజ్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

విశాలభారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily

ఆదివారం, 24.12. 2023
హైదరాబాద్



# వైకుంఠ ఉత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే లాస్యనందిత

- పాండురంగస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు
- కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లాస్యనందిత

**విశాలభారతి,కంటోన్మెంట్ :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం 150వ డివిజన్ పరిధిలోని పాండురంగస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. వేకువజామునుంచే స్వామిదర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఎమ్మెల్యే లాస్యనందిత కుటుంబసమేతంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఉత్తర ద్వారం గుండా పాండురంగ స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దయతో అందరికీ మంచి జరగాలని ఎమ్మెల్యే లాస్యనందిత ప్రార్థించారు. రాష్ట్రప్రజలంతా సుఖ, సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే లాస్యనందిత మాతృమూర్తి గీతమ్మ, బీఆర్ఎస్ నాయకురాలు నివేదితతో పాటు ఆలయ ఛైర్మన్ రాజుసింగ్, మాజీ ఛైర్మన్ దాసరి కర్ణకుమార్, సందీప్, భాగ్య, అజయ్ ఆనంద్, విక్రమ్, ముప్పిడి గోపాల్, పనస సంతోష్, వంగల మల్లేశ్, గజ్జెల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్‌టిఆర్ భవన్‌లో ఘనంగా సెమీ క్రిస్‌మస్ వేడుకలు

**కేక్‌ను కట్ చేసి క్రిస్‌మస్ శుభాకాంక్షలను తెలిపిన పలువురు నేతలు**

**విశాలభారతి, హైదరాబాద్:** యేసు క్రీస్తు ఈ లోకంలోకి మానవ రూపములో వచ్చిన రోజు లోకానికి పండగరోజు. లోకాన్ని ఏంతో ప్రేమించి ప్రజలను పాపం నుంచి విడిపించేందుకు పశులపాకలో పుట్టిన రోజు క్రిస్మస్ అని రెవరెండ్ పాస్టర్ మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా బైబిల్ వాఖ్యలను చదివి వినిపించారు, అనంతరం ప్రార్థనలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు దేవుని దీవెనలు ఉండాలని నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ విజయం సాధించి మరల ముఖ్యమంత్రి కావాలని దేవుని కృప ఉండాలని ప్రార్థించారు. రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ.. ప్రజలకు క్రిస్‌మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ అన్ని మతాలను సమానంగా చూస్తూ సర్వ మానవ సౌభ్రాతృత్వం కోసం కృషి చేసే లౌకిక వాద పార్టీ అని అన్నారు. క్రీస్తు పుట్టిన రోజు వేడుకలకు సమయాత్తం అవుతూ ఈ సెమి క్రిస్‌మస్‌ను జరుపుకోవడం జరుగుతున్నదని అన్నారు. ప్రేమ అంటేనే జీసెస్ అని, పొరుగు వారిని ప్రేమించడమే క్రైస్తవ మత సిద్ధాంతమని అన్నారు. మతం కన్న కూడా మానవ జీవన విధానం గురించి క్రైస్తవం తెలుపుతుందన్నారు. పొరుగు వారిని ఆదుకోవడం, సంఘ సేవ వంటి వాటిని ఏసు క్రీస్తు బోధించారని అన్నారు.బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీపతి సతీష్ మాట్లాడుతూ..ఏసుక్రీస్తు ఇచ్చిన శాంతి సందేశ అడుగుజాడల్లో మనమందరం నడుద్దామని అన్నారు.రాష్ట్ర పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వేజండ్ల కిషోర్ మాట్లాడుతూ.. క్రీస్తు త్యాగ నిరతిని కొనసాగిస్తూ మనమందరం ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నానని అన్నారు. రాష్ట్ర పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సంధ్యపోగు రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచానికి ప్రేమ సందేశాన్ని అందించిన ఏసు క్రీస్తు పుట్టిన రోజు పండుగ అయిన క్రిస్‌మస్ వేడుకలను ఎన్టీఆర్‌భవన్‌లో జరుపుకోవడం ఆనవాయితి. ఈ సందర్భంగా ప్రజలందరికీ క్రిస్‌మస్ శుభాకాంక్షలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా క్రిస్టమస్ వేడుకలు

**క్రిస్మస్ దుస్తులు అందజేసిన ఎమ్మార్వో, మున్సిపల్ చైర్మన్**

**చిట్యాల,విశాలభారతి:** క్రిస్టమస్ పండుగ ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని మున్సిపాలిటీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అన్నారు. చిట్యాల పట్టణంలోని మౌంట్ సీయోను చర్చిలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం క్రిస్ మస్ పండగ సందర్భంగా క్రైస్తవులకు పంపిణీ చేస్తున్న దుస్తులను ఎమ్మార్వో దశరథ తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ అన్నివర్గాల పేదలు సంతోషంగా పండుగలను జరుపుకోవాలని క్రైస్తవుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పేదలని గుర్తించి వారికి సహకారాలు అందించాలని, పేద విద్యార్థులు చదువుకునేలా వారిని ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు.ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘం ప్రతినిధిలు పోకల అశోక్, కౌన్సిలర్లు బెల్లి సత్తయ్య, కోనేటి క్రిష్ణ, జమాండ్ల జయమ్మ శ్రీనివాస్ రెడ్డి , జిట్ట పద్మ బోందయ్య తదితరులు పాల్గొన్నారు





# మండల కేంద్రంలో దుకాణాల చోరీ

**నూతనకల్ ,విశాలభారతి:**నూతనకల్ మండల కేంద్రంలోని దుకాణాలలో దొంగతనం జరిగినట్లు నూతనకల్ ఎస్సై నరేష్ తెలియజేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం రాత్రి సుమారు 11:00 గంటల సమయంలో మండల కేంద్రంలో A 2 Z కిరాణ షాపు ముందు పార్కు చేసిన టీఎస్26G7675 నెంబరు గల ద్విచక్ర వాహనాన్ని ,షాపుకు ఎదురుగనున్నా ఏవియం మొబైల్ షాపు షట్టర్ తాళాలు పగలగొట్టి షాపులో ఉన్న నగదును గుర్తు తెలియని దొంగలు దొంగలించినట్లు షేక్ తాజీద్ బాబా ఫిర్యాదు ఇచ్చారని తెలియజేశారు. అనంతరం దొంగతనం జరిగిన స్థలాన్ని తుంగతుర్తి సీఎం బ్రహ్మమురారి సందర్శించి సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలియజేశారు. నేరస్థలానికి ఫింగర్ ప్రింట్ ,ఐటి సెల్ వారిని తీసుకువచ్చి ఫింగర్ ప్రింట్లను సేకరించినట్లు పేర్కొన్నారు. దొంగలను త్వరలో పట్టుకుంటామని పోలీసులు ధీమా వ్యక్తంచేశారు.

# అర్హులకు మోడల్‌కాలనీలో ఇండ్లు కేటాయిస్తాం

- ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ఇందిరమ్మ రాజ్యంలో అక్రమ కేసులుండవ్
- మేం పరిపాలకులం కాదు.. సేవకులం
- కలెక్టర్లతో రివ్యూ తర్వాత సీఎం తీపి కబురు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**హుజూర్‌నగర్, విశాల భారతి:** మేము పరిపాలకులం కాదు.. సేవకులం అని కామెంట్స్ చేశారు గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. హుజూర్ నగర్ మోడల్ కాలనీలో 2 వేల160 ఇండ్లును పూర్తి చేసి.. 3 నెలల్లో అర్హులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇవే కాకుండా ఇంకా సుమారు 700 ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాటలకే పరిమితమై.. శిలాఫలకం వేసి వదిలిపెట్టిందని విమర్శించారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ లో రామస్వామి గట్టు వద్ద ఇందిరమ్మ మోడల్ కాలనీని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వెంకట్రావు, జిల్లా అధికారులు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడారు. గృహ నిర్మాణశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సంబంధిత శాఖపై అధ్యయనం చేయడానికి మొదటిసారి హుజుర్ నగర్ లో పర్యటించానని చెప్పారు పొంగులేటి శ్రీనివాసరెడ్డి. కాంగ్రెస్ హయాంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్న సమయంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని చెప్పారు. బీఆర్ఎస్ హయంలో రూ.30 కోట్లు ఖర్చు చేస్తే హుజుర్ నగర్ లో నిర్మించిన ఇండ్లు పూర్తయ్యేవని.. కనీసం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఆ పని చేయలేదన్నారు. ప్రతి గ్రామానికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. కాళేశ్వరం, సీతారామ మేడిగడ్డ ప్రాజెక్టులపై విచారణ చేయిస్తామని, బాధ్యులు ఎంతటి వారినైనా వదిలిపెట్టమని స్పష్టం చేశారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 6 లక్షల 71 వేల 757 కోట్ల రూపాయల అప్పులు చేసిందని, ఆ డబ్బులను ఏం చేశారో కూడా చెప్పలేదన్నారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలతో పాటు మరికొన్ని సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో మంత్రులు పనిచేయలేని పరిస్థితి ఉండేదన్నారు. కబ్జా చేసిన భూములను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని.. నిరు పేదలకు అందిస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అక్రమ కేసులు ఉండవని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను కడుతూ ఆరు గ్యారెంటీ పథకాలను కూడా అమలు చేస్తామని స్పష్టం చేశారు. డిసెంబర్ 28వ తేదీ అందరికి తీపి కబురు అందిస్తామన్నారు.

## నా పాలనలో మాటలుండవ్.. కను సైగలే..

- అధికారులకు మంత్రి 'పొంగులేటి' హెచ్చరిక



**ఖమ్మం, విశాల భారతి:**పాలేరు అధికారులను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడ ఎలా జరిగిన పాలేరులో మాత్రం లంచం తీసుకుని పోస్టింగ్ ఇవ్వడం జరగదని స్పష్టం చేశారు. శనివారం పాలేరులోని కుసుమంచి మండలంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. 'అధికారులు నా జ్ఞానేంద్రియాలు వారు ఒళ్ళు దగ్గర పెట్టుకొని పని చేస్తే నాకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. రాష్ట్రంలో ఎక్కడ ఎలా జరిగిన పాలేరులో మాత్రం లంచం తీసుకొని పోస్టింగ్ ఇవ్వడం జరగదు. అలాగే అధికారులు కూడా ఎటువంటి రూపాయి ఆశించకుండా ప్రజల పనులు నెరవేర్చాలి. ఏ అధికారిని ట్రాన్స్ఫర్ చేయడం జరగదు వారి పద్ధతి మార్చుకొని విధులు నిర్వహించాలి. అలా జరగకపోతే వారి అంతట వారే వెళ్లే విధంగా కనుసైగల తోటే జరుపుతా. నా పరిపాలనలో మాటలు ఉండవు కను సైగలు మాత్రమే. ఎన్ని శక్తులు ఎదురైన, ఎన్ని కుట్రలు పన్నినా మీ అందరి దీవెనలతో గెలిచాను. ఎన్నికల సమయంలో అనేక గ్రామాల్లో ఇచ్చిన వాగ్దానాలు త్వరలోనే పూర్తి చేస్తా. అనేక మంది ధరణితో ఇబ్బందులు పడుతున్నారు. నమ్ముకున్న ప్రతి ఒక్కరినీ కాపాడుకుంటా. ప్రతి ఇంటికి ఆరు గ్యారెంటీలు తీసుకొని వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ లను నెరవేర్చుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో మంత్రుల అద్వర్యం లో ప్రతి గ్యారెంటీ అమలు చేస్తాం. గతంలో కొంతమంది అనేక కేసులు పెట్టారు.వాటన్నింటినీ పరిష్కరిస్తాను. ఆరు గ్యారెంటీ లను వంద రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పాము.రెండు మూడు రోజుల్లో తీపి వార్త వింటారు. ఆరు కోట్ల డెబ్బై ఒక్క లక్షల కోట్ల అప్పులు చేసింది గత ప్రభుత్వం. ఇరవై నాలుగు గంటల కరెంట్ ఇస్తున్నామని చెప్పిన గత ప్రభుత్వం81 వేల కోట్ల అప్పులు చేసి ఒప్పచెప్పింది. ఎన్ని అప్పులు మా నెత్తిన పెట్టిన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం. గతంలో ఆగి పోయిన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించాం. ఏ ఒక్క అధికారికి డబ్బులు తీసుకుని పోస్టింగ్ లు ఇవ్వం. ప్రజల నుంచి అధికారులు ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పని చేయాలి. నన్ను నమ్ముకున్న ఏ కార్యకర్తకు అన్యాయం జరిగినా చూస్తూ ఊరుకోను. ప్రజలు కోరుకునే ఇందిరమ్మ రాజ్యం కోసం అధికారులు కలిసి పనిచేయాలి. ఎన్నికల వరకే రాజకీయాలు, మేము కానీ మా పార్టీ నాయకులు కక్ష పూరిత చర్యలకు పాల్పడం' అని మంత్రి వ్యాఖ్యానించారు.





# బాబుతో పీకే భేటీ!

- రాజకీయాల్లో పెను సంచలనం
- వైసీపీకి పనిచేస్తున్న ఐప్యాక్?
- చంద్రబాబుతో ప్రశాంత్ కిశోర్ భేటీపై సర్వత్రా ఆసక్తి
- బెంగాల్ ఎన్నికల తర్వాత బ్రేక్ తీసుకున్న పీకే

**విశాలభారతి,ఆంధ్రప్రదేశ్:**ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ఉండవల్లి నివాసంతో చంద్రబాబుతో సమావేశం అయ్యారు. హైదరాబాద్ నుంచి ఒకే విమానంలో లోకేష్, ప్రశాంత్ కిషోర్ వచ్చారు. తర్వాత వారు ఒకే వాహనంలో ఉండవల్లికి వెళ్లారు. ఈ పరిణామం ఒక్క సారిగా ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ప్రశాంత్ కిషోర్ వైసీపీకి స్ట్రాటజిస్ట్. గత ఎన్నికల్లో ఆయన వ్యూహాలతోనే విజయం సాధించామని సీఎం జగన్ నేరుగానే చెప్పారు. ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ నేరుగా పని చేయకపోయినప్పటికీ.., ఐ ప్యాక్ ఇప్పటికీ వైసీపీకి పని చాస్తుంది. ఈ క్రమంలో ప్రశాంత్ కిషోర్ టీడీపీతో టచ్ లోకి వెళ్లడం వైసీపీ వర్గాలను షాక్‌కు గురి చేస్తోంది.

**విజయవంతమైన వ్యూహకర్తగా పేరు తెచ్చుకున్న ప్రశాంత్ కిషోర్**

ప్రశాంత్ కిషోర్ విజయవంతమైన వ్యూహకర్తగా గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఆయన చివరి సారిగా బెంగాల్ ఎన్నికలకు మమతా బెనర్జీ కోసం పని చేశారు. ఆ తర్వాత ఆయన స్ట్రాటజిస్టుగా పని చేయలేదు. ఆయన సంస్థ ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ మాత్రం వివిధ పార్టీలకు పని చేస్తోంది. ప్రస్తుతం ఐ ప్యాక్ కు చెందిన రిషి రాజ్ .. వైసీపీకి పని చేస్తున్నారు. వైసీపీ కార్యకలాపాలు పూర్తిగా ఐ ప్యాక్ చేతుల మీదుగానే నడుస్తున్నాయన్న అభిప్రాయం ఆ పార్టీలో వినిపిస్తూ ఉంటుంది. అయితే ఇటీవల ప్రశాంత్ కిషోర్ జగన్ మోహన్ రెడ్డి పాలనా తీరుకు వ్యతిరేకంగా కొన్ని కామెంట్లు చేశారు. ఇటీవల వైసీపీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్న పీకే వివిధ మీడియా చానళ్ల డిబేట్స్ లో పాల్గొన్నప్పుడు..ఏపీలా అప్పులు చేసి పంచుకుంటూ పోతే దేశం దివాలా తీస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డికి పని చేసి గెలిపించినందుకు తనను ఇప్పుడు విమర్శిస్తున్నారని కూడా ఓ సారి చెప్పారు. అలాంటి వ్యతిరేక వ్యాఖ్యల తర్వాత చంద్రబాబుతో ప్రశాంత్ కిషోర్ భేటీ కావడం సహజంగానే రాజకీయవర్గాలను ఆశ్చర్యంలో ముంచెత్తింది. గత ఏడాది బీఆర్ఎస్ కోసం కొన్నాళ్లు పని చేశారు కానీ.. తర్వాత కేసీఆర్ వద్దనుకున్నారు. టీడీపీకి పని చేయడానికి ప్రశాంత్ కిషోర్ ఆసక్తి కనబరుస్తున్నారని గతంలో జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే దీన్ని ఎవరూ నమ్మలేదు. ఇప్పుడు నేరుగా టీడీపీ హైకమాండ్ తో ప్రశాంత్ కిషోర్ భేటీ కావడం.. సంచలనంగా మారింది. ఇది వైసీపీ క్యాంపును దిగ్భ్రాంతికి గురి చేస్తోందని చెప్పవచ్చు.

**టీడీపీకి పని చేస్తారా ? సలహాలిస్తారా ?**

ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకి కూడా ఓ స్ట్రాటజిస్ట్ ఉన్నారు. రాబిన్ శర్మ అనే స్ట్రాటజిస్ట్ నేతృత్వంలోనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన కూడా గతంలో ప్రశాంత్ కిషోర్ కు చెందిన ఐ ప్యాక్ లో పని చేసిన వారే. తర్వాత సొంత సంస్థ పెట్టుకున్నారు. ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ చంద్రబాబుతో భేటీకి కారణం ఏమిటన్నది మాత్రం క్లారిటీ లేదు. టీడీపీ కోసం పని చేస్తారా.. సలహాలిస్తారా అన్నది తేలాల్సి ఉంది

# గుడి మల్కాపూర్‌లో భారీ అగ్ని ప్రమాదం

- తప్పిన పెను ప్రమాదం
- సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది



**విశాలభారతి,హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో మరో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గుడిమల్కాపూర్ లోని అంకుర ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం సంభవించింది. పది అంతస్తుల భవనంలో ఓచోట మంటలు చెలరేగి, క్రమంగా మిగతా అంతస్తులకు మంటలు వ్యాపించాయి. ఐదో అంతస్తులో మంటలు చెలరేగడంతో అగ్ని ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటల్ని అదుపులోకి తీసుకొచ్చారు. ఫైర్ సేఫ్టీ అధికారుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. కింది ఫ్లోర్ లలో మంటలు చెలరేగాయి. క్రమంగా పై అంతస్తు వరకు మంటలు వ్యాపించినట్లు సమాచారం. హాస్పిటల్ లో బిల్డింగ్ ఎలివేషన్ మెటీరియల్ కు నిప్పు అంటుకోవడంతో మంటల తీవ్రత అధికమైనట్లు భావిస్తున్నారు. మంటల్ని గమనించిన హాస్పిటల్ సిబ్బంది పేషెంట్లను వేరే ఫ్లోర్ లోకి తరలిస్తున్నారు. ఈ హాస్పిటల్ లో అధికంగా పేషెంట్లు చిన్నారుల, గర్భిణీలు కావడంతో ఆందోళన వ్యక్తమైంది. అయితే అగ్నిమాపక సిబ్బంది వారిని కాపాడారు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్నిప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలిస్తున్నారు.

## గత పాలకుల ఆస్తులపై కూడా..

# శ్వేత పత్రం విడుదల చేయాలి

**దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**



**వరంగల్, విశాల భారతి :**గత పాలకుల ఆస్తులపై కూడా శ్వేతపత్రం విడుదల చేస్తే బాగుంటుందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభిప్రాయ పడ్డారు. శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా వరంగల్ నగరంలోని బట్టల బజార్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి తనకు ఓటు వేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసి తీరుతామని సురేఖ స్పష్టం చేశారు. అదేవిధంగా దేవాదాయ శాఖ మంత్రిగా దేవాలయ భూముల కబ్జాపై ఖచ్చితంగా చర్య తీసుకుంటామన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే గిరిజనుల సమ్మక్కసారక్క జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ మహా జాతరను మంత్రి సీతక్కతో కలిసి తాను విజయవంతం చేస్తామన్నారు. ఇక ప్రభుత్వం ఇచిన్న శ్వేత పత్రం పైనా వివాదాస్పదం చేస్తున్న టీఆర్ఎస్ ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్‌నేతలు అధికారంలోకి రాకముందు వారి ఆస్తులు ఎంత..? అధికారంలోకి వచ్చిన తర్వాత 10 ఏళ్ల పాలన అనంతరం వారి ఆస్తుల వివరాలపై కూడా శ్వేత పత్రం విడుదల చేస్తే బాగుంటుందన్నారు.

# పల్లె వెలుగు బస్సులు ఎక్కండి

- ఇకపై ఎక్స్‌ప్రెస్ బస్సులు అనుమతించిన స్టేజీల్లో మాత్రమే ఆపుతాం
- ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బందికి సహకరించాల
- మహిళలకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పెషల్ రిక్వెస్ట్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్న టీఎస్ ఆర్టీసీ కీలక విజ్ఞప్తి చేసింది. తక్కువ దూరం ప్రయాణించే మహిళలు పల్లె వెలుగు బస్సులు ఎక్కాలని కోరింది. తక్కువ దూరం ప్రయాణించే వారు, ఎక్కువగా ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎక్కుతున్నట్టుగా యాజమాన్యం దృష్టికి వచ్చిందని తెలిపింది. తద్వారా ఎక్కువ దూరం వెళ్లే ప్రయాణికులు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంస్థ ఎండీ సజ్జనార్ ఎక్స్ (ట్విటర్) వేదికగా వెల్లడించారు.ఈ సమస్యను అధిగమించేందుకు, తక్కువ దూరం ప్రయాణించే మహిళలు పల్లె వెలుగు బస్సులు ఎక్కాలని సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. కొందరు మహిళలు అనుమతించిన స్టేజీల్లో కాకుండా, మధ్యలోనే బస్సులను ఆపాలంటూ సిబ్బందిపై ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. ఇకపై ఎక్స్‌ప్రెస్ బస్సులు అనుమతించిన స్టేజీల్లో మాత్రమే ఆపుతారని స్పష్టం చేశారు. ఈ విషయమై ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలని సజ్జనార్ కోరారు.దూర ప్రాంత ప్రయాణికులకు ప్రాధాన్యత ఇవ్వండి : అదేవిధంగా దూర ప్రాంత ప్రయాణికులకు ప్రాధాన్యత ఇచ్చి సిబ్బందికి సహకరించాలని సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణం విజయవంతంగా కొనసాగుతోందని చెప్పారు. ఇందుకు సహకరిస్తున్న సిబ్బందికి, ప్రయాణికులందరికీ సజ్జనార్ ధన్యావాదాలు తెలిపారు.మరోవైపు ప్రయాణికుల సౌకర్యార్థం సంక్రాంతి నాటికి, 200 కొత్త డీజిల్ బస్సులను టీఎస్ఆర్టీసీ అందుబాటులోకి తీసుకురానుంది. వీటిలో 50 బస్సులను వారం రోజుల్లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రజలకు మెరుగైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని కలిగించేందుకు ఈ బస్సులను సంస్థ వాడకంలోకి తెస్తోంది. హైదరాబాద్‌లోని బస్‌భవన్ ప్రాంగణంలో, కొత్త లహరి స్లీపర్ కమ్ సీటర్, రాజధాని ఏసీ, ఎక్స్‌ప్రెస్ బస్సులను సంస్థ ఎండీ సజ్జనార్ పరిశీలించారు.ఈ బస్సుల్లో ప్రయాణికులకు కల్పిస్తోన్న సౌకర్యాలను సజ్జనార్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. మహాలక్ష్మి పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఫథకాన్ని అమలు చేస్తుండటంతో ప్రయాణికుల రద్దీ పెరిగిందని, వీలైనంత త్వరగా బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కొత్త బస్సులను కొనుగోలు చేయాలని, టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించిందని సజ్జనార్ తెలిపారు.

**నాలుగైదు నెలల్లో 2,000లకు పైగా కొత్త బస్సులు :** ఇందులో భాగంగా నాలుగైదు నెలల్లో 2,000లకు పైగా కొత్త బస్సులు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని సజ్జనార్ పేర్కొన్నారు. అందులో 400 ఎక్స్‌ప్రెస్, 512 పల్లెవెలుగు, 92 లహరి స్లీపర్ కమ్ సీటర్, 56 ఏసీ రాజధాని బస్సులు ఉన్నాయని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల విషయానికి వస్తే హైదరాబాద్ సిటీలో 540, తెలంగాణలో ఇతర ప్రాంతాలకు 500 బస్సులను వాడకంలోకి తెస్తామని వివరించారు. వీటిన్నింటిని వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు రూపొందించామని సజ్జనార్ వెల్లడించారు



# తొమ్మిదో తరగతిలోనే అతనితో ప్రేమలో పడ్డా... !

సొట్ట బుగ్గల చిన్నది తాప్సీ తన లవ్ లైఫ్ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది. పంజాబీకి చెందిన ఈ బ్యూటీ తెలుగు, తమిల్ లోనూ పలు సినిమాలు చేసి అలరించింది. అయితే కొంతకాలానికి టాలీవుడ్ లో అవకాశాలు లేక బాలీవుడ్ చెక్కేసిన నటి.. వరుస సినిమాలతో దూసుకుపోతుంది. లేడీ ఓరియంటెడ్ మూవీస్ తోపాటు స్టార్ హీరోల సరసన నటిస్తూ తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకుంటోంది. ఈ క్రమంలోనే రీసెంట్ గా వచ్చిన షారుఖ్ మూవీ 'DUNKI'లో ఓ కీలక పాత్రలో మెరిసిన ఆమె సినిమా ప్రమోషన్స్ లో భాగంగా కెరీర్ అండ్ పలు పర్సనల్ విషయాలను అభిమానులతో షేర్ చేసుకుంది. అలాగే తన లవ్ ఎఫైర్ గురించి కూడా మాట్లాడిన నటి.. తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడే తాను ప్రేమలో పడ్డానని చెప్పింది. 'నా సీనియర్ అయిన ఒక అబ్బాయి అటిట్యూడ్ బాగా నచ్చేది. అతనూ నాతో చాలా క్లోజ్ గా ఉండేవాడు. ఈ క్రమంలో నేను అతనిపై ఇష్టం పెంచుకుంటున్న సమయంలోనే ఏమైందో తెలియదు నాతో మాట్లాడటం మానేశాడు. నన్ను కలిసేందుకు కూడా ఆసక్తి చూపలేదు. నా ఫ్రెండ్స్ ద్వారా అసలు విషయం తెలుసుకున్నా. నాతో ప్రేమ వ్యవహారం వల్ల తన చదువు దెబ్బతింటుదని, నాతో సమయం గడపడం వల్ల సరిగా దృష్టి పెట్టలేకపోతున్నానని బాధ పడుతున్నట్లు చెప్పాడు. దీంతో నేను కూడా అతనికి దూరంగా ఉడటం మొదలుపెట్టాను. క్రమంగా ఒకరికొకరం దూరమయ్యాం. విడిపోయే ముందు బాగా చదువుకొని లైఫ్‌లో సక్సెస్ కావాలని సలహా ఇచ్చాడు. అయితే ఆ వయసులో ప్రేమకు, ఆకర్షణకు తేడా తెలియకపోవడంతో అతని ప్రేమ జ్ఞాపకాలు నన్ను వెంటాడాయి. చాలా రోజులు అందులో నుంచి బయటపడలేకపోయా' అంటూ ఆసక్తికర విషయాలు వెల్లడించింది తాప్సీ.



# 'కన్నప్ప' ఫస్ట్ షెడ్యూల్ పూర్తి

విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రాబోతున్న 'కన్నప్ప' చిత్రంపై జాతీయ స్థాయిలో అంచనాలున్నాయన్న సంగతి తెలిసిందే. అయితే కన్నప్ప పోస్టర్‌తో ఆ అంచనాలు మరింతగా పెరిగాయి. ఇది వరకు ఎన్నడూ చూడని ఓ దృశ్యకావ్యంగా కన్నప్ప మూవీని తెరకెక్కిస్తున్నారు. న్యూజిలాండ్‌లో 90 రోజుల పాటు నిర్విరామంగా సాగిన ఫస్ట్ షెడ్యూల్ ముగిసిందని కన్నప్ప చిత్రయూనిట్ ప్రకటించింది. న్యూజిలాండ్, థాయ్‌లాండ్, ఇండియాకు చెందిన అత్యంత ప్రతిభావంతులైన 600 మంది ఆర్టిస్టులు, టెక్నిషియన్లతో ఈ ఫస్ట్ షెడ్యూల్‌ను పూర్తి చేశామని మేకర్లు తెలిపారు. న్యూజిలాండ్‌లోని అందమైన ప్రదేశాల్లో ఫస్ట్ షెడ్యూల్ కంప్లీట్ చేసిన చిత్రయూనిట్ ఇప్పుడు ఇండియాకు తిరిగి రానుంది. విష్ణు మంచు టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో మోహన్ బాబు, మోహన్ లాల్, శివ రాజ్ కుమార్, ప్రభాస్ వంటి మహామహులెంతో మంది నటిస్తున్నారు. ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రాన్ని దాదాపు 80 శాతం వరకు న్యూజిలాండ్‌లోనే షూట్ చేయనున్నారు. ఈ మూవీకి హాలీవుడ్ సినిమాటోగ్రఫర్ షెల్డన్ చౌ పని చేస్తున్నారు. ఫస్ట్ షెడ్యూల్ పూర్తి చేసుకున్నట్టుగా మోహన్ బాబు తన సోషల్ మీడియా ఖాతాలో ఈ విధంగా ట్వీట్ వేశారు. 'న్యూజిలాండ్ లో 600 మంది హాలీవుడ్, మరియు భారతదేశంలోని అతిరథ మహారథులైన నటీనటులతో, థాయిలాండ్ మరియు న్యూజిలాండ్ సాంకేతిక నిపుణులతో, విష్ణు మంచు కథానాయకుడిగా నిర్మిస్తున్న చిత్రం 'కన్నప్ప'. 90 రోజుల మొదటి షెడ్యూల్ న్యూజిలాండ్ లోని అద్భుతమైన లొకేషన్స్ లో ఆ పరమేశ్వరుడు, షిర్డీ సాయినాథుని ఆశీస్సులతో అనుకున్నది అనుకున్నట్టుగా దిగ్విజయంగా షూటింగ్ పూర్తి చేసుకుని భారతదేశానికి తిరిగి వస్తున్నాం' అని ప్రకటించారు.



# మరీ ఇంత అందంగా ఉంటే ఎట్లా రాధిక

మెహబూబా సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నేహా శెట్టి. మొదటి సినిమా నిరాశ పరిచినా కూడా సందీప్ కిషన్ తో కలిసి గల్లీ రౌడీ సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. ఆ తర్వాత అఖిల్ అక్కినేని హీరోగా నటించిన మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్ సినిమాలో కీలక పాత్రలో కనిపించింది. మొటి మూడు సినిమాలు కూడా నిరాశ పరిచిన కూడా అదృష్టం కొద్ది డీజే టిల్లు సినిమాతో ఈ అమ్మడికి సూపర్ హిట్ దక్కింది. ఆ సినిమాలో ఈమె పోషించిన రాధిక పాత్ర ను ఇప్పటికి జనాలు తలుచుకుంటూ ఉన్నారు అంటే ఆ పాత్ర ఎంతగా హిట్ అయిందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో అంతకు మించిన జోరును కనబర్చుతూనే ఉంటుంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు అందమైన ఔట్ ఫిట్ లో చాలా అందంగా కనిపిస్తూ కుర్రకారుకు మత్తెక్కిస్తోంది. అన్ని వర్గాల వారిని ఈ అమ్మడు అలరిస్తూ ఉంది. సోషల్ మీడియాలో ఈమె షేర్ చేసే ఫోటోలు వీడియోలు బోల్డ్ నెస్ లో శృతి మించకుండా, ఒక మోస్తరు అన్నట్లుగా ఉంటూనే చాలా అందంగా రాధిక అలియాస్ నేహా శెట్టి కనిపిస్తోంది. ఈ రేంజ్ లో అందంగా సింపుల్ గా కనిపించడం కేవలం ఈ అమ్మడికే సాధ్యం అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# 'కెప్టెన్ మిల్లర్' నుంచి సెకండ్ సింగిల్ రిలీజ్

నేషనల్ అవార్డ్ విన్నర్, సూపర్ స్టార్ ధనుష్ మోస్ట్ అవైటెడ్ పీరియడ్ ఫిల్మ్ 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ధనుష్ కెరీర్ లోనే అత్యంత భారీ బడ్జెట్ చిత్రం. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ నేషనల్ వైడ్ గా ట్రెండ్ అయ్యింది. ఫస్ట్ సింగిల్ కిల్లర్ కిల్లర్ పాటకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ 'కెప్టెన్ మిల్లర్' సెకండ్ సింగిల్ క్రీనీడలే పాటని ని విడుదల చేశారు. స్టార్ కంపోజర్ జివి ప్రకాష్ ఈ పాట కోసం హార్ట్ టచ్చింగ్ నెంబర్ ని స్కోర్ చేశారు. రాకేందుమౌళి రాసిన లిరిక్స్ ఆకట్టుకున్నాయి. సింగర్ జావేద్ అలీ చాలా లైవ్లీగా అలపించారు. ఈ పాటలో ధనుష్, ప్రియాంకా అరుళ్ మోహన్ కెమిస్ట్రీ ని ప్రజెంట్ చేసిన విధానం చాలా ఎట్రాక్టివ్ గా వుంది.



# హాలీడేస్ సీజన్‌లో ప్రేక్షకులందరికీ ఫస్ట్ చాయిస్‌గా మారిన 'డంకీ'



బాలీవుడ్ బాద్షా షారూక్ ఖాన్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ రాజ్‌కుమార్ హిరాని కలయికలో రూపొందిన భారీ చిత్రం 'డంకీ'. క్రిస్మస్ సందర్భంగా ఈ చిత్రం డిసెంబర్ 21న ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున విడుదలైన సంగతి తెలిసిందే. తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌తో ప్రేక్షకులను హృదయాలను డంకీ చిత్రం గెలుచుకుంటోంది. ఎలాంటి యాక్షన్ సన్నివేశాలు లేకుండా ఫీల్ గుడ్ ఎంటర్ టైనింగ్, ఎమోషనల్ కంటెంట్ తో రూపొందిన ఈ చిత్రం తొలి రోజు కంటే శుక్ర, శని వారాల్లో అత్యద్భుతమైన స్పందనను రాబట్టుకుంది. ఆ రెండు రోజుల్లో సినిమాకు 40 నుంచి 50 శాతం బుకింగ్స్ పెరగటమే ఉదాహరణ అని చెప్పొచ్చు. అందుకు కారణం స్ట్రాంగ్ మౌత్ టాక్, ఫీల్ గుడ్ కంటెంట్ కారణంగా ఈ హాలీడే సీజన్ లో ప్రేక్షకులందరూ తమ కుటుంబాలతో కలిసి చూడటానికి డంకీనే మొదటి చాయిస్ గా ఎంపిక చేసుకుంటున్నారు. మన దేశంలోనే కాకుండా ఓవర్ సీస్‌లోనూ ఈ చిత్రం అద్భుతమైన స్పందనను రాబట్టుకుంటోంది. శుక్రవారం కంటే శనివారం 40 నుంచి 50 శాతం బుకింగ్స్ పెరగటం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచాయి. నాన్ యాక్షన్ జోనర్ మూవీకి ఈ రేంజ్ బుకింగ్స్ రావటం నిజంగా అభినందనీయమని అందరూ అంటున్నారు. 'డంకీ' చిత్రంలో టాలెంటెడ్ ఆర్టిస్టులు ప్రేక్షకులను మెప్పించారు.

# 'రోటి కపడా రొమాన్స్' ఫస్ట్ డోస్ విడుదల



'హుషారు, సినిమా చూపిస్త మావ, మేం వయసుకు వచ్చాం, ప్రేమ ఇష్క్ కాదల్, పాగల్' వంటి యూత్ ఫుల్ చిత్రాలను నిర్మించిన ప్రముఖ నిర్మాత, లక్కీ మీడియా అధినేత బెక్కెం వేణుగోపాల్.. సృజన్ కుమార్ బొజ్జంతో కలిసి నిర్మించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకుడు. శనివారం ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ డోస్ పేరిట పబ్లిసిటి వీడియోను విడుదల చేశారు. ఈ ఫస్ట్ డోస్ చూస్తుంటే.. ఇదొక వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లా కనిపిస్తుంది. ఈ ఫస్టడోస్‌లో వున్న యూత్‌ఫుల్ మూమెంట్స్ , ఫ్రెండ్‌షిప్, రొమాన్స్ ఇవన్నీ చూస్తుంటే యూత్‌కు ఇది మంచి కిక్ ఇచ్చే సినిమాలా కనిపిస్తుందని అంటున్నారు టీజర్ చూసిన వాళ్లు. ఈ చిత్ర విశేషాలను దర్శకుడు తెలియజేస్తూ నలుగురు స్నేహితుల కథ ఇది. వారి స్నేహం, ప్రేమ, వారి లైఫ్ జర్నీ ఈ చిత్రంలో చూపిస్తున్నాం. నేటి యువతరాన్ని అమితంగా ఆకట్టుకునే ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌లో కుటుంబ ప్రేక్షకులను అలరించే భావోద్వేగాలు కూడా వున్నాయి. అభిరుచి గల నిర్మాత బెక్కెం వేణుగోపాల్‌తో కలిసి సృజన్ కుమార్ బొజ్జం ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు.తప్పకుండా ఈ చిత్రం యూత్‌కు ఓ ఫెస్ట్‌లా వుంటుంది* అన్నారు.

# బబుల్‌గమ్' అందరికీ కనెక్ట్ అయ్యే సబ్జెక్ట్



ట్యాలెంటెడ్ డైరెక్టర్ రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రోషన్ కనకాల హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. మానస చౌదరి హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా టీజర్, ట్రైలర్, పాటలు ట్రెమండస్ రెస్పాన్స్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబర్ 29న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు రవికాంత్ పేరేపు విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలని పంచుకున్నారు. 'క్షణం' తర్వాత కృష్ణ అండ్ లీల చేశాను. నిజానికి కృష్ణ అండ్ లీల థియేటర్స్ లో రిలీజ్ కావాల్సింది. కానీ కోవిడ్ లాక్ డౌన్ కారణంగా ఓటీటీలో విడుదలయింది. లాక్ డౌన్ కారణంగా యాక్టర్స్ షెడ్యుల్స్ మారిపోయాయి. చేయాల్సిన ప్రాజెక్ట్స్ ఎక్కువైపోయాయి. ఈ క్రమంలో కొత్తవాళ్ళతో చేయడానికి 'బబుల్‌గమ్' కథ రాశాను. రోషన్ నాకు ముందే తెలుసు. తను హీరోగా పరిచయం అవుతున్నారని తెలిసి రోషన్ కలిశాను. ఈ కథకు తను పర్ఫెక్ట్ ఫిట్ అనిపించాడు. తర్వాత మా జర్నీ మొదలైయింది. జూలైలో షూటింగ్ మొదలుపెట్టి సినిమాని చాలా ఫాస్ట్ గా చేశాం. 'బబుల్‌గమ్' అందరికీ కనెక్ట్ అయ్యే సబ్జెక్ట్. ఇది కొత్తవాళ్ళతోనే చేయాల్సిన కథ. 22 ఏళ్ల తర్వాత కాలేజ్ పూర్తి చేసుకొని రియల్ వరల్డ్ లోకి అడుగుపెడతాం. అప్పటి వరకూ మన ఫ్యామిలీ, పేరెంట్స్ మనల్ని ప్రోటక్ట్ చేస్తారు. ఒక్కసారి మన ప్యాషన్ ని వెదుక్కుంటూ బయటికి వెళ్ళినపుడు అంతా కొత్తగా అనిపిస్తుంది. ఈ క్రమంలో ఎలాంటి కెరీర్ ని ఎంచుకోవాలి ? డబ్బులు వుంటే సరిపోతుందా ? మనకి ఇష్టమైనది చేయాలా? ఇలా చాలా కన్ఫ్యుజన్స్ వుంటాయి. ఇలాంటి సమయంలో అనుకోకుండా జీవితంలో ప్రేమ వస్తే ఎలా డీల్ చేస్తాం.. ఇలాంటి కథకు కొత్తవాళ్ళు వుంటేనే బెటర్ అనిపించింది. ఇది ప్రధానంగా ప్రేమకథ. ట్రైలర్ రిలీజ్ చేసినప్పుడు కూడా ఇది రాక్ స్టార్ లా ఉంటుందా ? లేదా ఒక మ్యుజిషియన్ ఫిల్మ్ లా వుంటుందా అని అడిగారు. అయితే ఇది ప్రేమకథ ప్రధానంగా వుండే రిలేషన్ షిప్ డ్రామా. అర్జున్ రెడ్డి వేరు.. ఇది వేరు. అర్జున్ రెడ్డిలా ఇందులో హీరోకి ఎంగర్ ఇష్యుస్ ఏమీ లేవు. అయితే అర్జున్ రెడ్డికి కోపం రావడంతో ఎవరికీ కోపం వచ్చినా అర్జున్ రెడ్డినే అంటున్నారు. రోషన్ ఫెంటాస్టిక్. ట్రైలర్ లో చూసింది పది శాతమే. సినిమాలో చాలా అద్భుతంగా చేశాడు. రోషన్, మానస ఇద్దరూ చాలా చక్కగా నటించారు. అలాగే ఇందులో నటించిన మిగతా నటీనటులు కూడా చక్కని ప్రతిభ కనపరిచారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.





## నవంబర్ నెలలో రియల్ భూమ్

ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా మూడు నెలల క్రయవిక్రయాలు మందగించాయి. ముఖ్యంగా కమర్షియల్ సెగ్మెంట్‌లో లావాదేవీలే నిలిచిపోయాయి. ఈ క్రమంలో పెట్టుబడులు పెట్టే పెద్ద కంపెనీలు కూడా ఎన్నికల సమయం కావడం ముందుకు రాలేదు. దీంతో ఆఫీస్, కమర్షియల్ స్పేస్‌లో అమ్మకాలపై ప్రతికూల ప్రభావమే చూపించింది. దీంతో రెసిడెన్షియల్ సెగ్మెంట్‌లోనూ క్రయవిక్రయాలు ఆగిపోలేదు కానీ సాధారణ రోజుల కంటే కొంత మేర తగ్గు ముఖం పట్టాయి. ఇలా మార్కెట్ కొనసాగుతున్న క్రమంలోనే ఎన్నికలు జరిగిన నవంబర్ నెలలో జరిగిన క్రయవిక్రయాలపై నైట్ ఫ్రాంక్ సంస్థ అధ్యయనం చేసింది. ఇందులో తెలంగాణ వ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా నవంబర్ నెలలో జరిగిన క్రయవిక్రయాల పరిధిని పరిగణనలోకి తీసుకుని ప్రాపర్టీ స్టాంప్ డ్యూటీ రెవెన్యూలో నమోదైన వృద్ధిని వెల్లడించింది. కొత్త ప్రభుత్వం కూడా రియల్ ఎస్టేట్ రంగానికి అన్ని విధాలుగా సహకరిస్తామనే సానుకూల సంకేతాలను ప్రకటించడం కొంత మేర ప్రభావం చూపింది. దీంతో గతంలో ఎన్నడూ లేనంతగా స్టాంప్ డ్యూటీ రెవెన్యూ వచ్చిందని తేల్చింది. దీంతో ప్రభుత్వాలు మారినా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్‌కు ఢోకా లేదని రియల్ ఎస్టేట్ నిపుణులు పేర్కొంటున్నారు. దేశంలోనే అతిపెద్ద ప్రాపర్టీ మార్కెట్లలో ఒకటిగా హైదరాబాద్ ఉంది. ఓవైపు ధరలు పెరుగుతున్నా ఇళ్ల కొనుగోలు కోసం జనాలు ఆసక్తి చూపుతున్నారు. ఈ నవంబర్ నెలలో ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు 25 శాతం పెరిగినట్లు తెలిపింది. మొత్తం 6,268 డీల్స్ పైగా జరిగితే గతేడాది కన్నా 29 శాతం వృద్ధి ఉందని తేల్చింది. దీని ప్రకారం అధిక ధర కలిగిన ఇళ్లకే ప్రజలు ఎక్కువ మొగ్గు చూపుతున్నట్లు పేర్కొంది. చాలా ఏళ్లుగా హైదరాబాద్ కేంద్రంగా ఉన్న రియల్ భూమ్ యథావిధిగా కొనసాగుతుందనే దానికి ఇదొక శుభపరిమాణంగా వ్యాపారులు భావిస్తున్నారు. దీనికి తోడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక పాలసీ రేట్లను ఏప్రిల్ 2023 నుంచి యథాతథంగా కొనసాగించడంతో ఇళ్ల కొనుగోలుదారులకు ఊరట లభించింది. దేశవ్యాప్తంగా ప్రాపర్టీల విక్రయాల్లో స్థిరమైన వృద్ధి నమోదు కావడానికి కారణమైందంటున్నారు. హైదరాబాద్ కేంద్రంగా కొనుగోలుదారుల అభిరుచులకు తగినట్లుగా బిల్డర్స్ ఇళ్లను నిర్మిస్తున్నారు. స్టాండ్ ఎలోన్ ప్రాజెక్టుల నుంచి మొదలుకుంటే లగ్జరీ ఇళ్లు వరకు నిర్మిస్తున్నారు. దీంతో కొనుగోలుదారులు కూడా సులభంగా స్థిరాస్తిని ఎంపిక చేసుకునే వెసులుబాటు వచ్చిందని చెబుతున్నారు.



# గేరు మార్చిన రియల్ భూమ్

- ప్రభుత్వం మారిన రియాల్టీపై కానరాని ప్రభావం
- కొత్త ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగానికి భరోసానిస్తే మరింత దూకుడు
- మరో రెండు నెలల్లో యథావిధిగా క్రయవిక్రయాలు
- ఆఫీస్ స్పేస్‌లో అమ్మకాలు పెరిగితే మారనున్న రియల్ తీరు

**విశాలభారతి, హైదరాబాద్ :**
రియల్ ఎస్టేట్ రంగంలోనే దేశంలోనే అన్ని మెట్రో నగరాల కంటే ముందు వరుసలో హైదరాబాద్ ఉంది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత మౌలిక వసతులు, పెట్టుబడులపై ప్రభుత్వం దృష్టి పెట్టడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం పుంజుకున్నది. ఈ పదేళ్లలో కరోనా రూపంలో వచ్చిన ఆటంకాన్ని కూడా తట్టుకుని నిలబడేంత పటిష్టంగా మారింది. రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం ఇచ్చిన సహకారం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో పోటీ లేదన్నట్లుగా దూసుకుపోయింది. సుస్థిరమైన అభివృద్ధి, మెరుగైన మౌలిక వసతులే రియల్ పెట్టుబడులను పట్టుకొస్తాయని బలంగా విశ్వసించిన అప్పటి ప్రభుత్వం తరహాలోనే కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం కూడా ఆచరిస్తే ఖజానాకు ఆదాయం సమకూర్చే రియల్ ఎస్టేట్ రంగం దశ తిరిగినట్లేననే భావన వ్యక్తం అవుతున్నది. తెలంగాణలో నవంబర్ నెలలో జరిగిన ఎన్నికల నేపథ్యంలో రియల్ మార్కెట్ తీరుతెన్నులను పరిశీలించిన నైట్ ఫ్రాంక్ సంస్థ.. స్టాంప్ డ్యూటీ రెవెన్యూ ఆధారంగా మార్కెట్‌పై ఎన్నికల ప్రభావం లేదని స్పష్టం చేసింది. రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ జోరు కొనసాగుతోంది.

ప్రభుత్వ మారినా రియల్ ఎస్టేట్ రంగానికి ఢోకా లేదని తేలిపోయింది. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగానికి అనుకూలంగా తీసుకునే నిర్ణయాలు, అదే సమయంలో కొత్త పెట్టుబడులు, మెరుగైన మౌలిక వసతులలో వేగం పెంచగలిగితే... మార్కెట్‌లో యథావిధిగా క్రయవిక్రయాలు జోరందుకుంటున్నాయని నిపుణులు భావిస్తున్నారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి రియల్ ఎస్టేట్ రంగం పడిపోతుందనే అపోహల కంటే ఆయా ప్రభుత్వాలు చేపట్టే కార్యాచరణ, మౌలిక వసతులు, పెట్టుబడుల ఆధారంగానే మార్కెట్ ఆధారపడి ఉంటుందనేది స్పష్టమైన క్రమంలో తెలంగాణలో కొలువుదీరినా కాంగ్రెస్ ప్రభుత్వం, రియల్ ఎస్టేట్ వ్యాపారం సమగ్రమైన అవగాహన కలిగిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఈ రంగంలో జరిగే మోసాలు, ఆర్టిఫిషియల్ మార్కెట్ ప్రైజింగ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే గనుక రియల్ మార్కెట్‌లో సంక్షోభానికి తావే ఉండదని చెబుతున్నారు.



## మోసాలపై దృష్టిపెడితే... సామాన్యుడికి భరోసా

అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం సామాన్యుడికి భరోసానిచ్చేలా సొంతింటి కలను సాకారం చేసేలా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా గతంలో అడ్డగోలుగా సాగిన ప్రీ లాంచ్ లావాదేవీలతో వందల కోట్లను కస్టమర్లు నష్టపోయారు. ఈ క్రమంలో ఆ తరహా మోసాలకు తావు లేకుండా ప్రత్యేక దృష్టి పెడితే... మార్కెట్‌పై విశ్వాసం పెరిగి ఇతర రాష్ట్రాల నుంచి పెట్టుబడులు పెరిగేందుకు ముందుకు వస్తారు. దీనికోసం రియల్ ఎస్టేట్ రంగానికి అనుబంధంగా ఉండే యంత్రాంగాలను బలోపేతం చేయడంతోపాటు, మరింత స్వతంత్రంగా పనిచేసే స్వేచ్ఛను కల్పించడం, ఈ రంగానికి అవసరమైన ప్రభుత్వ ప్రోత్సాహకాలను కల్పించడం వలన ప్రాజెక్టుల నిర్మాణం పుంజుకుంటుందని అంచనా వేస్తున్నారు. అదేవిధంగా రియల్ ఎస్టేట్ రంగంపై నేరుగా ప్రభావం చూపే పెట్టుబడుల విషయంలో వివాదస్పద, సంచలనాత్మక నిర్ణయాల కంటే, గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాల కంటే పారదర్శకతను పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



## ఆఫర్డబుల్ ఇండ్లకు ఫుల్ గిరాకీ..

సాధారణ మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతికి అనువుగా ఉండే ఆఫర్డబుల్ ప్రాజెక్టులకు హైదరాబాద్ కేంద్రంగా ఇప్పటికీ డిమాండ్ ఉంది. నవంబర్ నెలలో హైదరాబాద్ ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లలో అత్యధికంగా రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల మధ్య ధర ఉన్న ప్రాపర్టీలు ఉన్నాయని తేల్చింది. రూ.25 50 లక్షల మధ్య ధర కలిగిన ఇళ్లను కొనుగోలు చేసేందుకు జనాలు ఆసక్తి చూపారు. అలాగే రూ.1 కోటి ఆపైన విలువ కలిగిన ప్రాపర్టీల రిజిస్ట్రేషన్లు 13 శాతంగా ఉండగా, గతేడాదితో పోల్చితే 7శాతం వృద్ధి నమోదు కావడం విశేషం. ఈ లెక్కన సాధారణ జనాలకు అనువైన ప్రాజెక్టులను మరిన్ని మార్కెట్‌లోకి రావాల్సిన అవసరం ఉందని, ఇప్పుడున్న డిమాండ్ ప్రకారం సులభంగా అమ్ముడుపోయే అవకాశం కూడా ఉందని చెప్పవచ్చు. అదే సమయంలో సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లకు డిమాండ్ క్రమంగా పడిపోతుండగా డబుల్ బెడ్‌రూమ్‌ల కంటే హైదరాబాద్‌లో త్రిపుల్ బెడ్రూం ఇండ్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. గతేడాది కంటే రెండు శాతం పెరగగా, ప్రస్తుతం 58 శాతం మేర డిమాండ్ ఉంది. అదేవిధంగా నాలుగు బెడ్‌రూంలు ఉండే ఇండ్ల కొనుగోళ్లు కూడా 5 శాతం నుంచి 7 శాతానికి పెరిగాయి.



## కలిసొచ్చిన ఏడాది

2023లో జనవరి నుంచి నవంబర్ వరకు రియల్ ఎస్టేట్ రంగానికి భారీగా కలిసి వచ్చింది. ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ రంగంలో జరిగిన లావాదేవీలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. జనవరి - నవంబర్ మధ్య రిజిస్ట్రేషన్ల విలువ, ప్రాపర్టీల విక్రయాలు పరంగా చూసుకుంటే ఈ 11 నెలల కాలంలో ఒక్క హైదరాబాద్ నగరంలో 64,658 యూనిట్లు విక్రయించినట్లుగా నైట్ ఫ్రాంక్ పేర్కొంది. వీటి రిజిస్ట్రేషన్లు, స్టాంప్ డ్యూటీ ద్వారా మొత్తం రూ.34,205 కోట్లు రెవెన్యూ వచ్చినట్లుగా నివేదిక తెలిపింది. గత రెండేళ్ల కాలంలో చూసుకుంటే ఇదే అత్యధికంగా నైట్ ఫ్రాంక్ పేర్కొంది. ఇందులో ఎక్కువగా హైదరాబాద్ రెసిడెన్షియల్ మార్కెట్లో నాలుగు జిల్లాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లా కేంద్రాలను ఆనుకుని క్రయవిక్రయాలు జరిగాయని తేల్చింది.